# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 280 పేజీలు 8 వెల: రూ.1/-


## భూటాన్‌లో మోదీకి ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగష్టు 17: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ భూటాన్ వెళ్లారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. పారో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన మోదీకి ఆ దేశ ప్రధాని లోటే షేరింగ్ స్వాగతం పలికారు. ఆ తర్వాత మోదీ సైనిక స్వాగతం అందుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇవాళ ఉదయం మోదీ భూటాన్ వెళ్లారు. పలు ద్వైపాక్షిక అంశాలపై రెండు దేశాలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నాయి.

# బాలాలయంలో శ్రీవారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్



యాదాద్రి, ఆగష్టు 17: బాలాలయంలో యాదాద్రి శ్రీ నరసింహస్వామివారిని సీఎం కేసీఆర్ దర్శించుకున్నారు.

ఆలయ అర్చకులు, అధికారులు సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదాద్రిలో సీఎం పర్యటిస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనులను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. ముందుగా కొండచుట్టు 5.2 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు పనులను సీఎం పరిశీలిం చారు.

యాదాద్రి గుట్ట చుట్టూ రూ.143 కోట్ల వ్యయంతో రింగ్‌రోడ్డును నిర్మిస్తున్నారు.

# కశ్మీర్‌లో చక్కబడుతోన్న పరిస్థితులు

**- ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ**

**- రోడ్లపైకి వస్తున్న ప్రజలు**

శ్రీనగర్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370, 35 ఏలను కేంద్రం రద్దుచేయడంతో సరిహద్దుల్లో నెలకున్న ఉద్రిక్త పరిస్థితులు మెల్లమెల్లగా తగ్గుముఖం పడుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగక్కుండా వేలాది మంది సైన్యాన్ని మోహరించిన కేంద్రం, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. స్వాతంత్రదినోత్సవ వేడుకలను ఉగ్రవాదులు భగ్నం చేయడానికి కుట్ర పన్నినట్టు నిఘావర్గాలు హెచ్చరించడంతో కశ్మీర్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అయితే, చెదురు మదురు ఘటనలు మినహా వేడుకలు ప్రశాంతంగా ముగియడంతో కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకుంటున్నాయి. ఆంక్షలు మెల్లమెల్లగా తొలగడంతో జనం ఇప్పుడిప్పుడే భయం వీడి రోడ్లపైకి వస్తున్నారు. తాజాగా ఐదు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. శనివారం ఉదయం నుంచి జమ్మూ, రేసీ, సాంబ, కథువా, ఉధంపూర్ జిల్లాల్లో 2జీ ఇంటర్నెట్ సేవలను తిరిగి ప్రారంభించారు. కశ్మీర్ లోయలో ఇప్పటి వరకు మొత్తం 17 టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లను పునరుద్ధరించడంతో 50 వేల ల్యాండ్‌లైన్స్ అందుబాటులోకి వచ్చినట్టు అధికారులు తెలిపారు. మిగతా 20 ఎక్స్ఛేంజ్‌లను త్వరలోనే పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. శ్రీనగర్‌లో సివిల్ లైన్స్, విమానాశ్రయం సమీపంలోని కంటోన్మెంట్ ఏరియాలోనూ టెలిఫోన్ సేవలు తిరిగి ప్రారంభమైనట్టు వెల్లడించారు. మధ్య కశ్మీర్‌లోని బుద్గామ్, సోనామార్గ్, మనిగ్రామ్, ఉత్తర కశ్మీర్‌లోని గురేజ్, టాంగ్‌మార్గ్, ఉరి కేరన్ కర్ణా, తంగ్ధార్‌లోనూ ల్యాండ్‌లైన్ సేవలు పునరుద్ధరించారు. జమ్మూ కశ్మీర్ వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఆగస్టు 5 నుంచి మొబైల్, ల్యాండ్‌లైన్ సేవలను కేంద్రం ఆదేశాలతో అధికారులు నిలిపివేశారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు చక్కబడటంతో ఆంక్షలను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నిర్ణయించింది. జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బీవీఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ... ఉగ్రవాదులు తమ కార్యకలాపాలను నిర్వహించడానికి మొబైల్ కనెక్టివిటీని ఉపయోగించడంలో ఎదుర్కొంటున్న నిరంతర ముప్పును దృష్టిలో ఉంచుకుని టెలికం సేవలను దశల వారిగా పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ఆంక్షలను నిరంతరం సమీక్షిస్తున్నామని, శాంతిభద్రతల పరిస్థితి ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు చక్కదిద్దడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆదేశించారు.

# హిమాచల్, పంజాబ్‌లలో భారీ వర్షాలు

## విరిగిపడుతున్న కొండచరియలు

న్యూఢిల్లీ,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): ఉత్తరాదిలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్,పంజాబ్కు వరదముప్పు పొంచివుంది. హిమాచల్ ప్రదేశ్ లో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరుగుతుండడంతో రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి. అనలే కొండ ప్రాంతాలు, అందులోనూ ట్రాఫిక్ ఎక్కువవుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండి జిల్లాలోని గోహర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టి రోడ్డుపై అందరినీ ఆపేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఇకపోతే పంజాబ్‌లో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నాయి. దీంతో ఆ రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించారు. పంజాబ్‌లో రెండు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు భారతీయ వాతావరణశాఖ తాజాగా హెచ్చరించింది. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు అధికారులను అప్రమత్తం చేశారు. రెవన్యూ, డ్రెయినేజీ, హెల్త్, ఫుడ్, యానిమల్ హజ్‌బెండ్రీ శాఖలకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. వరద తాకిడి పెరగడంతో బాక్రా డ్యామ్ గేట్లను ఎత్తేశారు. సట్లజ్‌తో పాటు జలంధర్ లోతట్టు ప్రాంతాల్లో ఉండేవారికి హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లను ఇప్పటికే భారీ వర్షాలు హోరెత్తించాయి.

# లంక గ్రామాల్లో ప్రజల ఆందోళన

## నీటిలో మునగడంతో రాకపోకలకు అంతరాయం

## అధికారుల పర్యవేక్షణ..కొనసాగుతున్న సహాయక చర్యలు









కృష్ణా వరద ఉధృతితో నీటమునిగిన లంక గ్రామాలు, నీటమునిగిన గ్రామాల నుంచి బయటపడుతున్న ప్రజలు

గుంటూరు,ఆగస్ట్17( ఆర్ఎన్ఎ): కృష్ణమ్మ ఉగ్రరూపంతో ప్రకాశం బ్యారేజీ దిగువన ప్రస్తుతం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 21 లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ప్రస్తుతానికి ఇళ్లలోకి నీరు రాకున్న రోడ్లు, పొలాలు జలమయం అయ్యాయి. నది మధ్యలో ఉన్న పెదలంక, చింతల్లంక, సుగ్గునలంక, కనిగిరిలంక, ఈపూరులంక, చిలుమూరులంక, అన్నవంపులంక, కొత్తూరులంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చుట్టూ వరద నీరు చేరడంతో తాగడానికి మంచి నీరు కరువైంది. దీంతో ఆయా గ్రామాలకు పడవల సాయంతో తాగునీటి ప్యాకెట్లు, డబ్బాలను యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నారు. కొల్లూరు, కొల్లిపర, భట్టిప్రోలు మండలాల నుంచి ఐదు వేల మందికి పైగా లంక గ్రామాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పశువులు, వంట చెరకు, మరికొంత వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లు, పడవలపై మండల కేంద్రాలకు తరలించుకుంటున్నారు. ప్రత్యేకంగా ఆరు పడవలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో చెప్పారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి శుక్రవారం ఏడున్నర లక్షలకు పైగా వరద నీటిని నదిలోకి వదిలివేయడంతో కృష్ణమ్మ ఉప్పొంగి లంక గ్రామాలపై పడింది. లంక గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభించింది. దీంతో కృష్ణాతీరంలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన ప్రస్తుతం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 21 లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. రేపల్లె మండలంలోని పల్లిపాలెం వద్ద ప్రమాదకర పరిస్థితి నెలకొంది. విజయవాడ అమరావతి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మొత్తం 12 మండలాల్లోని 39 గ్రామాలు వరద ముంపునకు గురైనట్లుగా జలవనరుల శాఖ పేర్కొన్నది. లంక గ్రామాలను రాష్ట్ర మంత్రి మోపిదేవి వెంకటరమణరావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే డాక్టర్ మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్, ఆర్డీవో శ్యాంప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. లంక గ్రామా ల్లో 18 మరబోట్లను అధికారు లు సిద్ధం చేశారు. భట్టిప్రోలు మండలం చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాల నుంచి ఓలేరు వచ్చే మార్గం రోడ్డు వరద ఉధృతికి కోత పడటంతో అటు కూడా రవాణా స్థంభించింది కొల్లిపర మండలం లంక గ్రామాలు మొదలుకుని.. రేపల్లె మండలం లంకెవానిదిబ్బ వరకు అనేక చోట్ల కరకట్ట, ఏటి గట్లు గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గండ్లు పడే పరిస్థితులు ఉండడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలను అటువైపు వెళ్లకుండా నియంత్రిస్తు న్నారు. రొయ్యల చెరువులు కట్టలు తెంచుకుని కృష్ణా కరకట్ట పై వరకు వరద ఉధృతి పెరుగుతుంది. ఈ ప్రాంతంలోనూ మంత్రి మోపిదేవి పర్యటించి ఇసుక మూటలను అటుగా పెట్టించే పనులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. చుట్టూ వరద నీరు చేరడంతో తాగడానికి మంచి నీరు కరువైంది. దీంతో ఆయా గ్రామాలకు పడవల సాయంతో తాగునీటి ప్యాకెట్లు, డబ్బాలను యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నారు. కొల్లూరు, కొల్లిపర, భట్టిప్రోలు మండలాల నుంచి ఐదు వేల మందికి పైగా లంక గ్రామాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పశువులు, వంట చెరకు, మరికొంత వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లు, పడవలపై మండల కేంద్రాలకు తరలించుకుంటున్నారు. ప్రత్యేకంగా ఆరు పడవలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో చెప్పారు. రైతులు లంక భూముల్లో ఉన్న విద్యుత్ మోటార్లను, ఆయిల్ ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మత్సకారులు పడవల ద్వారా గ్రామస్థులను చేరవేస్తున్నారు. గింజుపల్లి వద్ద వాహనరాకపోకలు నిలిచిపోవడంతో పడవల ద్వారా ప్రయాణికులను చేరవేస్తున్నారు. వరదల వలన ఎక్కువ ప్రభావం గుంటూరు జిల్లా వైపున ఉన్న గ్రామాల పైనే పడుతోన్నది. మొత్తం 12 మండలాల్లోని 39 గ్రామాలు వరద ముంపునకు గురైనట్లుగా జలవనరుల శాఖ పేర్కొవది. కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పర్యటిస్తోన్న సమయంలో వర్షం ఇబ్బంది పెట్టింది. పల్లపుప్రాంతాల్లో వేసిన వాణిజ్య పంటలు రెండు రోజుల క్రితమే నీటమునగటంతో వేరు కుళ్లిపనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆయా ప్రాంతాలను మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలైన కోళ్లూరు, పులిచింతల, గోపాలపురం, బోదనం, కేతవరం, కేతవరం తండా, చిట్యాల, చిట్యాలతండా ఎమ్మాజీగూడెం గ్రామాలు వరద గుప్పెట్లో చిక్కుకున్నాయి. బెల్లంకొండ మండలం ఎమ్మాజిగూడెం గ్రామంలో సగం గ్రామంలో నీటిలో మునిగిపోయింది. గృహాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. తీరప్రాంతంలోని మూడు ప్రాంతాలలో కట్టలు తెగిపోవటంతో కరకట్ట వెంబడి గ్రామాలలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## హైదరాబాద్ జూలో తెల్లపులి 'బద్రీ' కన్నుమూత



హైదరాబాద్, ఆగష్టు 17 : నగరంలోని నెహ్రూ జూ పార్కులో 14 ఏళ్ల తెల్లపులి 'బద్రీ' కన్నుమూసింది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న 'బద్రీ' శుక్రవారం మృతి చెందినట్లు జూ అధికారులు వెల్లడించారు. ఈ తెల్లపులికి జులై 27న చెవి వద్ద వాపు వచ్చింది. ఆ సమయంలో శస్త్ర చికిత్స చేయడంతో కొంత కోలుకుంది.

మళ్లీ ఈ నెల 7వ తేదీన తీవ్ర అస్వస్థతకు గురైంది.

ఆ వాపు ఐదున్నర కిలోల కణితిగా మారి, తక్కువ సమయంలోనే మెడకు పాకింది. దీంతో ఆహారం తీసుకోవడానికి బద్రీ ఇబ్బంది పడేదని అధికారులు తెలిపారు. మొత్తానికి 'బద్రీ' శుక్రవారం ఉదయం 11:30 గంటలకు కన్నుమూసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే 'బద్రీ' కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు తరలించారు. వినయ్(22) అనే తెల్లపులి కూడా కొద్ది రోజుల క్రితం మృత్యువాత పడింది. వినయ్, బద్రీ మృతి చెందడంతో నెహ్రూ జూపార్కులో తెల్లపులుల సంఖ్య తొమ్మిదికి పడిపోయింది. బద్రీ తిరుపతి జూలో 2006, ఏప్రిల్ 1న పుట్టింది. ఆ తర్వాత దీన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఆగని ఆవేశముతో
సాగెడి భాషణముల నొసగి - స్వాతంత్ర్యముకై
భోగములను వర్జించెను
రాగధి యైనట్టి "విజయలక్ష్మీ పండిట్" !!

*( ఆగష్టు 18 విజయలక్ష్మీ పండిట్ జయంతి)*

-రాధశ్రీ
సెల్: 9494481210

# బిఆర్కె భవన్ వద్ద ట్రాఫిక్ నిషేధం

హైదరాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): సచివాలయాన్ని బీఆర్కే భవన్‌కు తరలించడంతో ఇప్పుడుఉ ఈరోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లిబర్టీ నుంచి వచ్చే వాహనాలను జిహెచంఎంసి, బిఆర్కె భవన్ వైపు అనుమతించడం లేదు. రద్దీ పెరిగిన దృష్ట్యా శనివారం నుంచి జీహెచ్ఎంసీ టీ జంక్షన్ గుండా సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేసున్నారు. లిబర్టీ, బషీర్‌బాగ్ నుంచి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ జంక్షన్ వైపు వెళ్లే వాహనదారులను టీ జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు అనుమతిస్తారు. వాహనదారులు అంబేడ్కర్ విగ్రహం జంక్షన్, రవీంద్రభారతి, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్ దారులను వినియోంగిచుకోవాలని అధికారులు సూచించారు.

## పార్క్‌లో చిక్కుకున్న 300 మంది టూరిస్టులు

హైదరాబాద్, ఆగష్టు 17: అలస్కాలోని ఓ నేషనల్ పార్క్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ పార్క్‌కు వెళ్లిన సుమారు 300 మంది పర్యాటకులు అక్కడే చిక్కుకుపోయారు. కల్వర్ట్ నుంచి వరద రావడంతో.. రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో టూరిస్టులు ఆ పార్క్‌లోనే ఉండిపోయారు. అతి విశాలంగా ఉండే డెనాలీ నేషనల్ పార్క్‌లోనికి వెళ్లేందుకు ఒకే ఒక్క రోడ్డు మార్గం ఉంది. అయితే ఆ మార్గాన్ని మళ్లీ పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

# స్వాతంత్ర్యం ఏదీ..?

నేటినిజం

ఆదివారం 18-8-2019

*ఈ ఆగస్టు 15 వ తేదీకి మన దేశ స్వాతంత్ర్యానికి డెబ్బై రెండు ఏళ్ళు నిండాయి. మొన్నటికి మొన్నే పుట్టినట్లుంది.. అపుడే వృద్ధాప్యదశకు చేరుకుంది. అయితే ఈ స్వాతంత్ర్యాన్ని చూసి నవ్వాలో, ఏడవాలో తెలియనిస్థితి.. ఎందూజింటే జనాభాలో దాదాపు 37 శాతం దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతూనే ఉన్నారు. మహాత్మాగాంధీ స్వాతంత్ర్యం రెండు రకాలన్నారు. ఒకటి రాజకీయ స్వాతంత్ర్యం. రెండవది ఆర్థిక స్వాతంత్ర్యం. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఒక దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం అవసరమని వారు భావించేరు. తమ పరిస్థితుల్ని మెరుగు పరుచుకోవడానికి తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవడానికి ఈ రెండు స్వాతంత్ర్యాల కోసం అహింసా మార్గాలను ఎంచుకోవాలని ప్రజలకు తెలియజేసారు. ఎన్నో త్యాగాలకు సిద్ధపడి ధనిక పేద తేడాలు లేకుండా మన స్వాతంత్ర సమరంలో ఆనాడు పాల్గొనడంమూలంగానే 1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. కాకుంటే గాంధీ ధాన్యం పండించే రైతుకు ఆకలి ఉండకూడదన్నాడు. పాలు అమ్ముకునే వారి ఇంట్లో పిల్లలకు కడుపునిండా పాలుండాలని, ఈ దేశంలో పల్లెలు కళకళలాడుతూ ఉండాలిని, శాంతి, సౌఖ్యం, ఆనందం మన ముంగిటే నడవాలని కలలు కన్నారు. కాకుంటే ఆ కలల్ని నిజం చేసుకోకుండానే కన్నుమూసారు. మనకు స్వాతంత్ర్యమనే పసిపాపను అందించి తాను వెళ్ళిపోయారు. ఈ స్వాతంత్ర్యాన్ని ఏడిపించేరో, బరెసెలతో గుచ్చారో, కొడవలితో నరికారో, వెలివేసి ఆనందించారో తెలియదుకానీ నేడు మాత్రం వయసు పైబడి దిగులుగా కూర్చుంది. ఎందుకంటే తనను కన్నతండ్రి తను పుట్టగానే చనిపోవడమే అందుకు కారణం. కానీ ఆ తండ్రి కన్నకలలు ఏవీ? కళకళలాడాల్సిన పల్లెలేవీ? ఆకలిచావులు లేని రైతులు ఏరీ? కడుపునిండా శ్రేష్టమయిన పాలు తాగి కేరింతలు కొట్టాల్సిన పిల్లలేరీ? స్వాతంత్రానికి వయసు వచ్చినా నేడు పట్టెడు అన్నం కూడా దొరకని బడుగు జీవితాలకు సమాధానమేదీ? సమానంగా పంచుకోవాల్సిన ధనమంతా కొందరి చేతుల్లోనే మగ్గిపోతోంది. లక్షల కోట్ల రూపాయలు ప్రజా సంక్షేమం పేరిట వారి వారి స్వంత ఖజానాలోకి చేరుతూనే వున్నాయని తెలియని వారంటూ లేరు. అయినా ఒక్కరైనా నోరు తెరిచి అడగరేం?*

*ఇటీవలి కాలంలో రైతులు రెండు లక్షలకు పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నేడు ఈ సంఖ్య దాదాపు మూడు లక్షలకు చేరింది. జనాభాలో మూడింతలు దారిద్ర్యపు దిగువరేఖలోనే జీవిస్తోంది. వందకు 25 శాతం ప్రజల సగటు సంపాదన రోజుకు 12 రూపాయలకు మించిలేదు. కనీసం సరైన పౌష్టికాహారం కూడా లేని జనాభా ప్రపంచంలోకెల్లా భారతదేశంలోనే ఎక్కువగావుంది. అనారోగ్యం, అకాల మరణం లాంటి సంఘటనలతో ప్రజలకు ప్రాణభయం పేరుకుపోతోంది. ప్రపంచంలోకెల్లా మనదేశం చాలా గొప్పగావున్నా, ఇంకా ఆకలి రాజ్యమనే పిలవబడుతోంది. నేడు జరుగుతున్న ఘోరాలు, నేరాల వెనుక ఆకలే సమాధానమవుతోంది. ఇప్పుడు ఆలోచిస్తుంటే అందుకే*

*అనిపిస్తోంది మనకు స్వాతంత్ర్యం ఎందుకువచ్చింది? తెల్లదొరలనుండి నల్లదొరలచేతిలోకి మారడానికా ఈ ఉద్యమాలు..పోరాటాలు..? పుట్టినప్పటినుండి నేడు వయసుమళ్లినంతవరకు మనకేమి ఏమీ సాధించలేని స్వాతంత్ర్యాన్ని చూసి గర్వపడాలా? మంచిరోజులు వస్తాయని ఎంతకాలం ఆగాలి? ఇప్పటికే తరాలు, అంతరాలు కేవలం కాసులకోసం అమ్ముడుపోతున్నాయి. దీనికి సమాధానం చెప్పే నాయకులే లేరా? మన దేశ చరిత్ర సమస్తం అవినీతి,దోపిడీల గాధలే చివరకు మిగిలిపోతాయా? ఈ దారిద్ర్యంనుండి ప్రజలకు విముక్తిలేదా? ఈ స్వార్థపు అవినీతి రాజకీయాలను ప్రక్షాళన గావించేవారే లేరా? ఏమో! ఇప్పటికే స్వాతంత్రానికి జబ్బుతో కుంటుతోంది. మంచాన పడివున్న స్వాతంత్ర్యాన్ని ఎందరు పరామర్శించగలరు? కనీసం రాబోయే తరమైనా కాస్త కనిపెట్టుకుంటుందా? ఏమో!*

**ఈ నెల 23న హైదరాబాద్ లో పెన్షన్ అదాలత్ ను నిర్వహిస్తున్న**

## అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లొరేషన్ అండ్ రిసర్చ్

హైదరాబాద్, ఆగస్టు 17: పెన్షన్ అదాలత్ ను ఈ నెల 23వ తేదీ నాడు ఉదయం 10గంటల 30 నిముషాల నుండి అదే రోజు సాయంత్రం 4 గంటల మధ్య కాలం లో నిర్వహించనున్నట్లు భారత ప్రభుత్వ పరమాణు శక్తి విభాగం లో భాగం గా ఉన్న అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లొరేషన్ అండ్ రిసర్చ్ తెలిపింది. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని బేగంపేట్ లో గల సంస్థ ప్రధాన కార్యాలయమైన ఎఎమ్ డి కాంప్లెక్స్ లో ఉంటుంది. పింఛన్ కు సంబంధించి ఏవైనా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఎఎమ్ డి పెన్షనర్ లు / ఫ్యామిలీ పెన్షనర్ లు వారి సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ పెన్షన్ అదాలత్ కు హాజరు కావచ్చు. వారు వారి యొక్క ఇబ్బందులను జీసీ-తితితి.జీఎటఏణనీల.తిని అనే ఇ-మెయిల్ ఐడి ద్వారా ముందస్తుగానే తెలియజేయవచ్చని కూడా ఎఎమ్ డి పరిపాలనాధికారి సూచించారు.

## భూటాన్ కు బయలుదేరి వెళ్ళే ముందు ప్రధాన మంత్రి విడుదల చేసిన ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 17:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ భూటాన్ కు తాను బయలుదేరి వెళ్ళే ముందు విడుదల చేసిన ప్రకటన పాఠం ఈ క్రింది విధంగా ఉంది.

"నేను 2019వ సంవత్సరం ఆగస్టు 17వ మరియు 18వ తేదీల లో భూటాన్ కు ఆధికారిక పర్యటన పని మీద వెళ్ళనున్నాను.

ప్రస్తుత పదవీకాలం ఆరంభం లో నా యొక్క భూటాన్ సందర్శన మన విశ్వాసపాత్రమైన మిత్ర దేశం మరియు మన పొరుగు దేశమైనటువంటి భూటాన్ తో భారతదేశ సంబంధాల కు ప్రభుత్వం ఇస్తున్న అధిక ప్రాముఖ్యాని కి ఒక సూచిక గా ఉన్నది.

ఇండియా మరియు భూటాన్ ల మధ్య శ్రేష్టమైన ద్వైపాక్షిక సంబంధాలు వర్ధిల్లుతున్నాయి. ఈ విస్తృతమైన అభివృద్ధియుత భాగస్వామ్యం ఉభయ పక్షాల కు ప్రయోజనకారి గా నిలుస్తున్న జల-విద్యుత్తు సంబంధ సహకారం, ఇంకా బలమైన వ్యాపార సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఇందుకు ఒక నిదర్శనం గా ఉన్నాయి. ఈ సంబంధాలు ప్రజల కు ప్రజల కు మధ్య నెలకొన్న బలమైన సంబంధాలు మరియు ఉమ్మడి ఆధ్యాత్మిక వారసత్వం తో పరిపుష్టం అయ్యాయి.

ఇరు దేశాలు కిందటి సంవత్సరం లో లాంఛన ప్రాయ దౌత్య సంబంధాల కు అంకురార్పణ జరిగిన తరువాత స్వర్ణోత్సవాన్ని జరుపుకొన్నాయి.

ఈనాటి భారతదేశం, భూటాన్ భాగస్వామ్యం ఒక ప్రత్యేకమైన స్వభావాన్ని కలిగినటువంటిది. మరి అంతేకాకుండా, భారత ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానానికి ఒక ముఖ్యమైన స్తంభం గా కూడా ఉన్నది.

భూటాన్ రాజు మాన్య శ్రీ నాలుగో డ్రూక్ గ్యాల్పో తోను, భూటాన్ ప్రధాన మంత్రి తోను మన ద్వైపాక్షిక సంబంధాలన్నింటి విషయం లోను ఫలప్రదమైన చర్చలు జరపడం కోసం నేను ఎదురు చూస్తున్నాను. ప్రతిష్టాత్మకమైనటువంటి రాయల్ యూనివర్సిటీ ఆఫ్ భూటాన్ లో యువ విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించడం కోసం కూడా నేను నిరీక్షిస్తున్నాను.

నా యొక్క పర్యటన భూటాన్ తో కాల పరీక్ష కు తట్టుకొని నిలచినటువంటి మరియు విలువల తో పెనవేసుకొన్నటువంటి మైత్రి ని పెంపొందించడం తో పాటు, దానిని మన ఇరు దేశాల ప్రజల పురోగతి ని మరియు సమృద్ధమైన భవిష్యత్తు ను కూడా వర్ధిల్లజేస్తుందన్న విశ్వాసం నాలో ఉంది."

# కాంగ్రెస్ శ్రేణులకు భరోసా దక్కేనా?

హైదరాబాద్, ఆగష్టు 17:అధక్షపదవిని వదులుకున్న తరవాత కొంతకాలం పాటు రాహుల్ విశ్రాంతి తీసుకోవడ ఖాయం. ఇప్పుడు మళ్లీ సోనియా చేతికిపగ్గాలు రావడంతో కాంగ్రెస్ కురువృద్దుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. వచ్చే మూడు రాష్ట్రాల ఎన్నికల్లో విజయం ఖాయం అంటూ కాంగ్రెస్ ఆశలపల్లకిలో విహరించడం ఖాయం. నిజానికి రాహుల్ అలాగే కొనసాగుతూ నమ్మకస్తులైన యువనేతలను పార్టీకి తీసుకుని ఉంటే కాంగ్రెస్ పరిస్థితి వేరుగా ఉండేది. కానీ గబ్బి లాల్లా వేలాడుతున్న వృద్ధ జంబుకాలు మళ్లీ సోనియాకు పగ్గాలు అప్పగించే వరకు నిద్రపోలేదు. అధికారంలో ఉంటే సొంత గోల తప్ప ప్రజల గోలను పట్టించుకోవడం కూడా కాంగ్రెస్‌కు కష్టమే. కాంగ్రెస్ గత దశాబ్ద పాలనా కాలంలో పెద్దగా దేశానికి ఒరగబెట్టిందేమీ లేదు. యువనేతలను ముందుకు తీసుకుని వచ్చివుంటే పార్టీకి జోష్ వచ్చేది. అంతేగాకుండా అధికార ంలో ఉండగా కుంభకోణాల్లో కూరుకుని పోయింది. వారికి వ్యూహం లేకపోవడం వల్లనే పార్లమెంటులో కాశ్మీర్ విషయంలో పేలవమైన నిర్ణయం తీసుకున్నారు. 370 రద్దును స్వాగతించి కాశ్మీర్‌కు అభివృద్ధికి ప్యాకేజీ తదితర విషయాల్లో మాట్లాడి వుంటే కాంగ్రెస్ పరిస్థితి మరోలా ఉండేది. ఇకపోతే సోనియా పగ్గాలు చేపట్టినా, ఇప్పుడు పాతుకుపోయిన బిజెపిని పెకిళించడం అంతసులువు కాదు. 370 రద్దు, త్రిబుల్ తలాఖ్ నిర్ణయాలతో మోడీ,అమిత్ షాల ఛరిష్మా ఆకాశమంత ఎంత్తుకు ఎదగింది. దానిని నిలువరించే సత్తా కాంగ్రెస్‌కు లేదనేచెప్పాలి. అంతేగా కుండా అసాధ్యమని కూడా చెప్పాలి. ఇకపోతే వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంతకంతకూ దిగజారిపోతోంది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ప్రాభవం సాధించాలంటే ఏదో ఒకటి చేసినా లాభం లేదన్న స్థాయికి చేరింది. తమిళనాడు తరవాత ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ చరిత్ర ముగిసినట్లే. ఎపిలో ప్రత్యేకహోదా బిల్లు కోసం హామీలు గుప్పించినా ప్రజలు నమ్మలేదు. తెరాస అధికారంలోకి వచ్చిన తర్వాత వలసలను ప్రోత్సహించడంతో ఆ పార్టీ ఖాళీ అయ్యింది. దీంతో కార్యకర్తల్లో భరోసా నింపాలని ఆపార్టీ వ్యూహం రచించింది. ప్రజలు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో ఆందోళన నిర్వహించి వారికి దగ్గర వ్వాలని ప్రణాళిక వేసినా ఫలించడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం పేరుతో వేలాది కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసింది. ఇకపోతే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరగుతున్న కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు. ప్రత్యేకహోదాపై కోటి సంతకాలు మొదలు, అనేక ఉద్యమాలు చేసినా ప్రజలు దగ్గరకు రానివ్వలేదు. కాంగ్రెస్ కారణంగా ఎపికి ప్రత్యేకహోదా పెండింగ్‌లో ఉంది. అలాగే విభజన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే అసెంబ్లీ సీట్ల పెంపు అలాగే ఉండిపోయింది. అధికారం కోల్పోయిన తర్వాత నిరాశ నిస్పృహలతో ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు భరోసా కల్పించడానికి ఇప్పుడు సోనియా నాయకత్వంలో ఏ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారన్నది ముఖ్యం. ఎన్నికలకు ముందు తెరాస ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వాటి అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మని పరిస్థితి ఏర్పడింది. ఇటీవలి వరకు అనావృష్టితో రైతులు ప్రభుత్వంపై కొంత అసంతృప్తిగా ఉన్న మాట వాస్తవమే. అయితే మళ్లీ వర్షాలు డడం, రైతుబంధు అందడంతో తెలంగాణలో కాంగ్రెస్ ఉద్యమాలకు అవకావం లేకుండా పోయింది. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కాంగ్రెస్ నేతలంతా మండిపడ్డా ప్రజల్లో స్పందన కానరావడం లేదు. అప్పులపాలై రైతులు ఆత్మహత్యచేసుకుంటూ ఉంటే పట్టించు కోవడం లేదంటూ విమర్శలు చేస్తున్నా మద్దతు రావడం లేదు. వీరు ప్రజల్లో చోటు సంపాదించుకునే ప్రయత్నం చేశారు.కేసీఆర్‌కు కనీసం రైతు కుటుంబాలను పరామర్శించే తీరిక కూడాలేదంటు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. అప్పుల పాలై నిరాశలో ఉన్న రైతులకు తాము అండగా ఉండి పోరాడతామని భరోసా కల్పించారు. దీనికితోడు అక్రమంగా రైతుల భూములను సేకరిస్తే ఎకరం భూమిని కూడా పోనివ్వకుండా అండగా ఉంటామని రైతులకు సంకేతమిచ్చారు. అయితే ఇవేవీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఆదరణ ఇవ్వలేకపోయాయి. ఎపిలో అయితే లేవకుండా పోయారు. ఇక మిగిలింది తెలంగాణలో. ఇక్కడ కూడా గెలిచిన వారంతా అధికార టిఆర్ఎస్‌లో చేరారు. రాహుల్ పోయి సోనియా వచ్చినా పార్టీలో కొనసాగడం వల్ల ప్రయోజనం ఉండదన్న భావనలో కనాయకుల్లో ఉంది. అందుకే ఆయా రాష్ట్రాల్లో నాయకులు కాంగ్రెస్‌ను వీడుతున్నారు. వారంతా అధికార బిజెపిలో చేరుతున్నారు. మరో ఐదేళ్ల పాటు బిజెపిలో ఉంటే అధికారానికి దగ్గరగా ఉండవచ్చన్న భావనలో ఉన్నారు. దీంతో సోనియా పార్టీని రక్షించుకునేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తారన్నది ముఖ్యం. అలాగే పార్టీ నేతలకు భరోసా కలిగించగలరా అన్నది కూడా ముఖ్యమే. ఈ ఐదేళ్లు మోడీ ప్రభుత్వాన్ని ఢీకొనే సత్తా కాంగ్రెస్ సాధిస్తుందా అన్నది కూడా ప్రశ్నార్థకమే.

# అభివృద్ధిలో ప్రణాళికా సంఘందే కీలక భూమిక

### వినోద్ అనుభవానికి తగిన ఎంపిక

హైదరాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాల్లో ప్రణాళికా సంఘం పాత్ర అత్యంత కీలకమైనది. ముఖ్యమంత్రి నిత్యం పరిపాలనాపరమైన కార్యక్రమాల్లో నిమగ్నమై ఉం డాల్సిన అవసరం ఉండడంతో ప్రణాళికలకు సంబంధించిన అన్ని కీలక నిర్ణయాలు తీసుకునే బాధ్యత ఉపాధ్యక్షుడి పైనే ఉంటుంది. అందుకే ఉపాధ్యక్ష పదవిని కీలకమైన వ్యక్తులకు మాత్రమే అప్పగిస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌ను ప్రభుత్వం నియమించడం వెనక కెసిఆర్ తన లక్ష్యాలను ముందుకు తీసుకుని వెళ్లే వ్యక్తిగా నిలిపారు. వినోద్ కుమార్‌ను తన కుడిభుజంగా పేర్కొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పదవి అప్పగించి ఆయనకు సముచితస్థానాన్ని కల్పించారు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్య క్షుడిగా వ్యవహరించే రాష్ట్ర ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉంటూ అన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడంలో వినోద్‌కుమార్ ముఖ్యపాత్ర వహించే అవకాశం లభించింది. హైకోర్టు న్యాయవాదిగా, తెలంగాణ ఉద్యమకారునిగా రాజకీయాల్లో, పరిపాలనా వ్యవహారాల్లో విశేష అనుభవం ఉండడంతో ఆయన సేవలను మరింతగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ వినోద్‌కుమార్‌కు ఈ పదవిని అప్పగించారు. వినోద్‌కుమార్ టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆపార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా కేసీఆర్‌తోపాటు అన్ని ఉద్యమ కార్యాచరణల్లో కీలకంగా ఉంటూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలపాత్ర వహించడమే కాకుండా తెలంగాణకు మద్దతుగా జాతీయస్థాయిలో అన్ని పార్టీల మద్దతును కూడగట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా లేఖలను తీసుకోవడంలో వినోద్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు. ఆ తర్వాత ఆయన కరీంనగర్ ఎంపీగా ఉంటూనే తెలంగాణకు రావాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాల కోసం జాతీయ స్థాయిలో ప్రయత్నించడంలో కృషి చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పరాజయం పాలుకావడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన సేవలను ప్రణాళికా సంఘం ద్వారా వినియోగించుకోవాలని నిర్ణయించారు. 2019 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్ అనూహ్యంగా బిజెపి అభ్యర్థి బండి సంజయ్ చేతిలో పరాజయం పాలయ్యారు. తొలుత వినోద్‌కు ఎమ్మెల్సీ అవకాశాన్ని కల్పించి రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారం కూడా సాగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఇప్పటికే ఈటల రాజేందర్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా, కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిగా రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తుండగా త్వరలో కేటీఆర్‌కు కూడా మంత్రివర్గంలో చోటు ఖాయమ ని చెబుతున్నారు. దీంతో ఒకే జిల్లా నుంచి నాలుగు మంత్రి పదవులు అందులో వెలమ సామాజికవర్గానికి రెండు పదవులు అవుతాయనే భావనతో వినోద్ కుమార్‌కు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవిని కట్టబెటారని సమాచారం. ముఖ్యమంత్రి తన ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రణాళికాసంఘాన్ని అభివృద్ధి విషయంలో కీలకం చేయాలని నిర్ణయానికి వచ్చి వినోద్‌కుమార్‌కు ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి త్వరలో నే పూర్తిస్థాయి బ్జడెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అన్నిశాఖలకు సంబంధించిన వ్యవహారాలను సమీక్షించి ప్రతిపాదనలు తయారుచేసే కీలకమైన పనిని కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్‌కు అప్పగించారు. రాజకీయ నేతగా అనుభవం ఉన్న వినోద్ ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు తగిన అవకాశం ఏర్పడింది.

# చేరికలే లక్ష్యంగా బిజెపి సభ

### నేడు నడ్డా సమక్షంలో పలువురు చేరిక

హైదరాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో బలోపేతంపై దృష్టి పెట్టిన బీజేపీ చేరికలే లక్ష్యంగా ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ సభను ఏర్పాటుచేస్తోంది. బిజెపి కార్యనిర్వాహక అధ్యక్షుడు జెపి నడ్డా సమక్షంలో భారీగా చేరికలకు ప్లాన్ చేసింది. అలాగే జాతీయస్థాయి నేతలు దృష్టి పెట్టి పార్టీ లోకి వలసలను ప్రోత్సహిస్తున్నారు. ఇతర పార్టీల నేతలతో మాట్లాడుతూ.. బీజేపీలో చేరాలని కోరుతున్నారు. పార్టీలో చేరితే తగిన అవకాశాలు వస్తాయని హామీలిస్తున్నారు. పెద్ద నేతలు పార్టీలోకి వస్తే పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా సమక్షంలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 18న కొంత మంది నేతలను కలిపించేందుకు చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీ సీనియర్ నేతలతో చర్చిస్తూ.. బీజేపీలో చేరాలని కోరుతున్నారు. జాతీయ పార్టీ నేతలతోపాటు రాష్ట్ర పార్టీ అగ్ర నాయకత్వం ఇస్తున్న సూచనలను పాటిస్తూ ఆయా పార్టీ నేతలతో చర్చలు జరిపి ఒప్పించారు. గ్రామస్థాయిలో కూడా మాజీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ కేడర్‌ను కూడా పార్టీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. పార్లమెంట్ సీటు, స్థానిక సంస్థల్లో కొన్ని సీట్లను గెలిచిన బీజేపీ నేతలు ప్రస్తుతం పార్టీ బలోపేతంపైన దృష్టిపెట్టారు. వచ్చే రెండు నెలల్లో ఏ పార్టీ నుంచి ఎవరు చేరుతారో తేలే అవకాశం ఉంది. తెలుగు తమ్ముళ్లు కూడా ఒక్కొక్కరుగా సైకిల్ దిగుతున్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావం అనంతరం నియోజకవర్గంలో టీడీపీ నాయకత్వం బలహీనపడుతూ వచ్చింది. కార్యకర్తలున్నా దిశానిర్దేశర చేసే నాయకులు పార్టీని వీడుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులు డీలావడుతున్నాయి. ఈ నెల 18న బీజేపీలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు తెలిసింది. కీలక నేతలు పార్టీ వీడుతుండటంతో కార్యకర్తలకు దిశానిర్దేశర చేసేవారు కరువవుతున్నారు. మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే మరికొందరు పార్టీని వీడనున్నట్లు సమాచారం. వార్డులపై గురిపెట్టిన కొందరు టీడీపీ నాయకులు టీఆర్ఎస్ లేదా బీజేపీ టికెట్ ఇస్తామని మాటిస్తే ఆయా పార్టీల కండువాలు కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు చర్చ సాగుతోంది.

# జూరాలతో తీరనున్న నీటి సమస్యలు

### పంటలకు ఢోకా లేదంటున్న అధికారులు

మహబూబ్‌నగర్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): ఉమ్మడి పాలమూరు జిల్లా తాగునీటి అవసరాలను తీర్చుతున్న జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈసారి తుంగభద్రకు వరద నీరు రావడంతో తొలిసారిగా 750 క్యూసెక్కుల వరద నీటిని మొదటి పంపు ద్వారా వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజులుగా కాల్వల్లోకి నీరు తుమిళ్ల వెలుతుంది. తొలిసారిగా సాగు నీరు వస్తున్న సందర్భంగా రైతులు అనందంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, కుడి, ఎడమ కాల్వలతో పాటు సమాంతరం కాల్వలతో సాగునీటిని అందిస్తుంది. ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా 1, 2 ఎత్తిపోతల పథకానికి అవసర మైన నీటిని అందిస్తుంది. జూరాల కింద మొత్తం ఆరు లక్షల ఎకరాల భూములు సాగవుతున్నాయి. తుంగభద్ర నది నుంచి ఆర్డీఎస్ కాల్వల ద్వారా సాగునీరు అందించడానికి అవకాశం ఉండేది. జిల్లాలోని పత్తి, వరి, వేరుశేనగ, అము దం, మిరప, ఉల్లి పంటలను సాగు చేశారని వ్య వసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకు నె÷-టటెంపాడు కింద వరద నీటితో కొద్దిపాటిగా పంటలు మునిగిన నష్టం పెద్దగా జరగలేదు. ప్రాజెక్టులోకి సాగునీరు రావడంతో ఖరీఫ్‌తోపాటు రబీ పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. జూరాల కింద నె÷-టటెంపాడు ఎత్తిపోతల పథకం ఉంది. నాలుగు పంపుల నుంచి 2,800 క్యూసెక్కుల వరద నీరు తీసుకునే అవకాశం ఉంది. నెట్టెంపాడు నుంచి ర్యాలంపాడు నీటిని పంపిస్తారు. నాలుగు టీఎంసీల సామర్థ్యం కలిగిన ర్యాలంపాడు నుంచి గట్టు, మల్దకల్, దరూర్, కేటీదొడ్డి మండలాలకు సాగునీరు అందుతుంది. జూరాల కుడి కాల్వ ద్వారా గద్వాల, ఇటిక్యాల మండలాలకు సా గునీరు అందుతుంది. ఈ సారి వరద నీరు ఎ క్కువ కాలం వస్తుండడంతో రెండు పంటలకు సాగు నీరు అందే అవకాశం ఉంది. ప్రభుత్వం గత సంవత్సరం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి నీరిచ్చింది.

## హామీల అమలులో నిర్లక్ష్యం: తాహిర్ బిన్

నిజామాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్, ప్రధాని నరేంద్రమోడీలకు బుద్ధి చెప్పాలని డిసిసి అధ్యక్షుడు తాహిర్ బిన్ పిలుపునిచ్చారు. కేవలం సోనియా గాంధీ ధృడసంకల్పం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే దానిని తన కుటుంబ అధికారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు కేసీఆర్, మోదీ ఎన్నో అబద్దపు వాగ్దానాలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ నేడు రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ మరిన్ని ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వ అక్రమాలను ఎండగడతామని అన్నారు. సర్కార్‌కు ఇది కనువిప్పు కావాలన్నారు. కాంట్రాక్టర్ల నుంచి కమిషన్ల దండుకోవడానికే తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రాజెక్టుల రీ డిజైనింగ్ చేపట్టారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాగునీటి రంగంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామని ఆయన గుర్తు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల్ని దారుణంగా మోసపుచ్చిందని ఆరోపించారు. ఎన్నికల హామీల్ని నెరవేర్చడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఒకలా, ప్రభుత్వం ఏర్పాటయ్యాక మరోలా మాట్లాడుతోందని విమర్శించారు. రాష్ట్ర రైతాంగం అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రుణమాఫీ అంశంపై టీఆర్ఎస్ సర్కార్ తీరుపై కాంగ్రెస్ పోరాడుతుందని విరుచుకుపడ్డారు. తప్పుడు హామీల వల్లే కేసీఆర్ తెలంగాణకు సీఎం అయ్యారని అన్నారు. కేసీఆర్ తరహాలో తాము కూడా మోసపూరిత హామీలు ఇచ్చి ఉంటే నేడు కాంగ్రెస్ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేదని అభిప్రాయపడ్డారు.

## హరితహారం ఉద్యోగులకు ప్రోత్సాహం

ఆదిలాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): హరితహారంలో ఉత్తమంగా పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని డ్వామా పీడీ అన్నారు. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో నిర్లిప్తతగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హరితహారం కింద మొక్కలు నాటే లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆ మేరకు అధికారులు,ఉద్యోగులు పనిచేయాలని, జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. ఇదిలావుంటే హరితహారం ప్రగతిపై డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. డ్వామా, ఉపాధిహామీ, అటవీశాఖ, మున్సిపల్‌శాఖల ద్వారా మొక్కల ప్రగతిని సమీక్షించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించడంలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలవారిగా మొక్కలు నాటే లక్ష్యం ఎంత ఉంది.. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు.. నాటిన మొక్కలకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న ఆర్థికమాంద్యం

హైదరాబాద్, ఆగష్టు 17: ఆర్థిక మాంద్యం ఇప్పుడు మరోమారు ఆందోళన కలిగిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడా పరిస్థితి లేకున్నా ఆందోళన కలిగిస్తోందన్న వార్తల కలకలం రేపుతున్నాయి. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థిక రంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచు తున్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని నేతల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోవాలి. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసిన పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతులపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి.గత అయిదేళ్లలో ఇదే అతి తక్కువ వృద్ధి రేటు. కార్లు, ద్విచక్ర వాహనాలపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గిస్తే కానీ విక్రయాలు మళ్లీ ఊపందుకోవు. ఇటీవలి వరకు ప్రపంచంలో కార్ల ఉత్పత్తి, అమ్మకాల్లో నాలుగో స్థానంలో ఉన్న భారత్, ఆ స్థానాన్ని నిలబెట్టు కోవాలంటే తక్షణం ఇలాంటి చర్యలు తీసుకోకతప్పదు. పైగా పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం తగ్గుముఖం పట్టడం సైతం ఆర్థిక మందగతికి సంకేతం. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతున్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. గడచిన మూడు నాలుగు త్రైమాసికాలలో గిరాకీ క్షీణించడం వల్ల కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించు కుంటాయి. శక్తికాంత దాస్ గవర్నర్ అయినప్పటి నుంచి రిజర్వుబ్యాంకు రెపోరేటు తగ్గిస్తూనే ఉన్నారు. వాణిజ్య బ్యాంకులు ఈ రాయి తీని వినియోగదారులకు, పెట్టుబడిదారులకు బదిలీ చేయడం మీదనే ఆర్థిక వృద్ధి ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా వివిధ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం. బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 72ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపు కుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయి ని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు అందనంతగా ఎదిగి పోతోంది. ఇది డాలర్ బలమో లేక మన రూపాయి బలహీనతో కానీ పాలకులు

మాత్రం ఘనంగా అభివృద్ధి గురించి ఢంకా బజాయిస్తున్నారు. అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న వేయి విలువ ఇప్పుడు కొత్త రెండు వేల నోటుకు లేదంటే నమ్మగలమా? కానీ నమ్మాలి. ఆనాటి వేయి నోటు ఇవాళ్టి రెండువేల నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు. వివిధ సంక్షేమ పథకాల్లో దాదాపు 6 కోట్లమంది లబ్ధిదారులు లేకున్నా ఉన్నట్లు చూపించి ఇన్నాళ్లు ప్రజాధనాన్ని మింగేశారు. మేం వచ్చిన తర్వాత అవినీతి, నల్లధనాన్ని అరికట్టి సుమారు రూ. 90వేల కోట్ల ప్రజాధనాన్ని ఆదాచేసి దాన్ని పేదల అభివృద్ధికోసం ఉపయోగిస్తున్నాం. ఇప్పుడు దిల్లీ వీధుల్లో అధికార దళారులు లేకుండా చేశాం. ప్రభుత్వ విధానాలు మార్చి స్తామని చెప్పుకొని తిరిగేవారి దుకాణం మూతపడింది. బంధుప్రీతి లేకుండా చేశాం. అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు 3 లక్షల డొల్ల కంపెనీలకు తాళాలు వేసి వాటి డైరెక్టర్లపై చర్యలు మొదలుపెట్టాం. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన చివరి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఇవి. ఇంకా తన ప్రభుత్వం సాధించిన విజయాల ను, చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను వివరించారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య అభియాన్ పథకాన్ని, భారత కీర్తి పతాకను గగనపుటంచులకు తీసుకెళ్లే బృహత్తర అంతరిక్ష కార్యక్రమాన్నీ ప్రకటించారు. కశ్మీరు, మహిళలపై నేరాలు సహా ప్రస్తుతం దేశంలో నలుగుతున్న పలు అంశాలను స్పృశించారు. ప్రతి భారతీయుడికి ఇల్లు, విద్యుత్తు, గ్యాస్, నీరు, మరుగుదొడ్డి, నైపుణ్యాభి వృద్ధి, వైద్యం, బీమా, అనుసంధానం అన్న మంత్రాన్ని తీసుకొని దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. దళితులు, ఓబీసీలు, మహిళలకు న్యాయం చేయ డానికి తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవం ద్వారా దేశం సరికొత్త అవకాశా లను అందుకొనేలా చేస్తానన్నారు. ఇన్ని చెప్పిన ప్రధాని మోదీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విష యాన్ని మరచిపోయారు. ఆరోగ్యపథకం అందిస్తున్న వేళ దానికి వచ్చిన బీమారీ గురించి పట్టించు కోలేదు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించలేదు. ఈ ఐదేళ్లలో రూపాయి విలువ పెరగలేదు సరికదా మరింత దిగజారింది. కనీసం ఆనాటి స్థాయిలో వున్నా కొంత నయం అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేయాలి. అప్పుడే దేశ ఆర్థికరంగం బలోపేతం అవుతుంది.

## శ్రీశైలం,సాగర్‌లకు కొనసాగుతున్న వరద

నల్లగొండ,ఆగస్ట్17 (ఆంఎన్ఎ): శ్రీశైలం, నాగార్జున సాగర్ జలశయాలకు వరద ప్రవాహాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్ల ద్వారా 7.03 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 8.08 లక్షల క్యూసెక్కులు కొనసాగుతుండగా ఔట్‌ఫ్లో 8.19 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 881.60 అడుగులు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటినిల్వ 197.01 టీఎంసీలుగా ఉంది. ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 38,140 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,632 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,025 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 44 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో 7.11 లక్షల క్యూసెక్కులు కొనసాగుతుండగా ఔట్‌ఫ్లో 7.11 లక్షల క్యూసెక్కులు ఉంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 585.80 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటినిల్వ 299.74 టీఎంసీలు. 26 క్రస్ట్ గేట్ల ద్వారా 6.65 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

# మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌కు కీలక పదవి

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియిమించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ నియామకమయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేశారు. ఇంతకుముందు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నిరంజన్ రెడ్డి ఉన్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందడం.. మంత్రి పదవి చేపట్టడం జరిగింది. దీంతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి ఖాళీని వినోద్‌తో భర్తీ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ప్రణాళికా సంఘం అత్యంత కీలకమైనది కావడంతో అనుభవజ్ఞుడైన వినోద్ కుమార్‌ను ఈ సంఘానికి ఉపాధ్యక్షుడిగా సీఎం కెసిఆర్ నిర్ణయించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి త్వరలోనే పూర్తి స్థాయి బ్జడెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అన్ని శాఖలకు సంబంధించిన వ్యవహారాలను సమీక్షించి, ప్రతిపాదనలు తయారు చేసే కీలక పనిని కూడా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వ్యవహరించే వినోద్ కుమార్‌కు సిఎం అప్పగించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కేబినెట్ హోదా కలిగి వుండడంతో పాటు కేబినెట్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడిగా ఉంటారు. వినోద్ కుమార్ ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. రాజకీయాల్లో, పరిపాలనా అంశాల్లో ఉన్న అనుభవంతో పాటు తెలంగాణ రాష్ట్ర భౌగోళిక, సామాజిక, ఆర్థిక అంశాల పట్ల అవగాహన కలిగిన వినోద్ కుమార్ సేవలు సంపూర్ణంగా వినియోగించు కోవాలనే ఈ నియామకం చేపట్టినట్లు సిఎం చెప్పారు. దీనికితోడు ఉద్యమ కాలం నుంచి వినోద్ సిఎం కెసిఆర్‌కు చేదోడువాదోడుగా ఉన్నారు.

# అణ్వాయుధాలపై ప్రభుత్వ వైఖరి మారిందా?

### రాజ్‌నాథ్ ప్రకటనపై కాంగ్రెస్ అనుమానం
### స్పష్టత ఇవ్వాలన్న అభిషేక్ సింఘ్వీ

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): అణ్వాయుధాలను మొదట ఉపయోగించకూడదనే విధానమే నేటి వరకూ కొనసాగుతూ వస్తోందని, భవిష్యత్తులో ఏం జరుగుతుందనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ స్పందించింది. అణ్వాయుధాల విధానంలో భారత్ వైఖరి మారిందా అని ప్రశ్నించింది. రాజ్‌నాథ్ ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, అణ్వాయుధాల వినియోగంలో భారత్ ఇంతవరకూ అనుసరిస్తున్న విధానంలో ఏదైనా మార్పు వచ్చిందా అనేది తెలుసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. దీనిపై రాజ్‌నాథ్ ప్రకటన అస్పష్టంగా ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో రాజ్‌నాథ్ సింగ్ అణ్వాయుధాల వినియోగంపై ప్రకటన చేశారు. అణ్వాయుధాలను మొదట ఉపయోగించ కూడదన్నదే ఇంతవరకూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమని చెప్పారు. అయితే భవిష్యత్తులో ఏం జరుగుతుందనేది పరిస్థితులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. దీంతో అణ్వాయుధాల వినియోగంపై మోది సర్కార్ వైఖరిలో మార్పు వచ్చిందా? లేక మావద్ద కూడా అణ్వాయుధాలున్నాయంటూ పాక్ తరచు చేస్తున్న హెచ్చరికలను తిప్పిగొట్టేందుకే రాజ్‌నాథ్ ఆ ప్రస్తావన చేశారా అనేది రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. 1998లో ఐదు అణు పరీక్షలను పోఖ్రాన్ నుంచే భారత్ జరిపింది. మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి తొలి వర్ధంతి సందర్భంగా రాజ్‌నాథ్ ఇక్కడకు వచ్చారు.

# విమోచన దినోత్సవంపై స్పష్టత ఇవ్వాలి: బిజెపి

ఆదిలాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తారా లేదా అన్నది ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచనం నిర్వహించడంలో ఎందుకు భయపడుతన్నారో చెప్పాలన్నారు. తెలంగాణ గౌరవాన్ని ఇనుమడింప చేసేందుకు సెప్టెంబర్ 17న ప్రభుత్వమే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు రాష్ట్ర పార్టీ ఆలోచన చేస్తోందని, ఈ సభలకు భాజపా జాతీయ అధ్యక్షులు ఆమిత్‌షా రానున్నట్లు పేర్కొన్నారు. గతంలో తాము అధికారంలోకి వస్తే విమోచన దినోత్సవం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలన్నారు. ముస్లింలను మభ్య పెట్టేందుకు తెలంగాణ సెంటిమెంట్‌ను తాకట్టు పెట్టడం సరికాదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఎంఐఎంకు భయపడే.. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో తెరాస వైఖరి మారకుంటే బిజెపి అధ్వర్యంలో త్వరలో ఆందోళన చేపడతామని అన్నారు. సెప్టెంబర్ 17న తామే జాతీయ జెండా ఎగురవేస్తామని స్పష్టంచేశారు.

## సమస్యలను పక్కన పెట్టారు: ఏలేటి

ఆదిలాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ హయాం లోమాత్రమే రైతులకు ఎప్పుడూ న్యాయం జరిగేదని డిసిసి అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందని,అందుకే తాము ప్రజల పక్షానా పోరాడుతున్నామని అన్నారు. తెలంగాణ వచ్చాక కేవలం కేసీఆర్ కుటుంబమే లాభపడుతోందన్నారు.మంత్రులు సమస్యలను పక్కన పెట్టి అవినీతికి పాల్పడుతున్నా పట్టించుకోని సిఎం కెసిఆర్ ప్రజలను ఏం పట్టించుకుంటారని అన్నారు. కేవలం ఇతర పార్టీల వారిని టిఆర్ఎస్‌లో చేర్చుకోవడంలోనే కెసిఆర్ విజయం సాధించారని ఏలేటి ఎద్దేవా చేశారు. అధికారాన్ని ఉపయోగించి తమ పార్టీ నేతలు, కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది పేర్కొన్నారు. కాంగ్రెస్ హయంలో మంజూరైన జలాశయాలను పూర్తిచేయాల్సింది పోయి పునరాకృతి పేరుతో కొత్త జలశయాలకు తెరలేపి కాంట్రాక్టర్లనుంచి కమిషన్లు తీసుకుంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏడు జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించే ప్రాణహిత చేవళ్ల జలశయానికి కేవలం రూ.20కోట్లు విడుదల చేస్తే పనులు పూర్తి అవుతుండగా కేసీఆర్ మాత్రం జలాశయాన్ని మేడిగడ్డకు మళ్లించి అంచనా వ్యయం ఏకంగా రూ.86వేల కోట్లకు పెంచడంతో అవినీతికి తెరలేపారని అన్నారు. ఇది కేవలం కమిషన్ల కోసం కాక మరోటి కాదన్నారు. టిఆర్ఎస్ సర్కార్ గుత్తెదార్ల ప్రభుత్వంగా మారిందంటూ విమర్శలు సంధించారు.

# రూపాయికి శస్త్ర చికిత్స చేయాల్సిందే

### దిగుమతుల భారం తగ్గితేనే సత్ఫలితాలు
### ఆర్‌బిఐ చర్యల కోసం ఆర్థికవేత్తల చూపులు

ముంబై,ఆగస్టు17 (ఆర్ఎన్ఎ): రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం నాలుగేళ్ల క్రితం అంటే 2014 ఆగస్టు 14న డాలర్‌కు 61.05 పైసలు కాగా గతేడాది అదే రోజున రూ.69.76కు దిగజారింది. ఇప్పుడు ఇది 72 రూపాయలకు చేరింది. దీనివల్ల మన విదేశీ మారక నిల్వలు మరించుకు పోతున్నాయి. ఇదంతా కేవలం దిగుమతుల ప్రభావం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదీ మోడీ సాధించిన ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నారూపాయిని మాత్రం పట్టుకోలేక పోతున్నారు. నిజంగా రూపాయికి శస్త్రచికిత్స చేసే కార్యాక్రమాలు కానరావడం లేదు. మనవాళ్లను అమెరికా పంపించాలంటేనే భయం వెన్నాడుతోంది. చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు రూపాయలను బస్తాల్లో పంపినా అక్కడ పిడికెడు డాలర్లు రావడం లేదని వాపోతున్నారు. డెబ్బయ్యేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారిపోయి రూపాయి విలపిస్తుండగా, నిత్యావసరాల ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్న తీరు ఎక్కడా ప్రధాని మోడీ ప్రసంగంలో కానరాలేదు. 1947లో రూపాయి విలువ డాలర్‌తో సమానం. అంటే ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో మనం బాగా అభివృద్ధి సాధించామని ఈ రకంగా పోల్చుకోవాలేమో. డాలర్‌తో రూపాయి మారకం డెబ్బయ్యో వంతుకు చేరిపోయింది. అమెరికా, టర్కీల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో టర్కీ కరెన్సీ అయిన లిరా ఒడిదుడుకులకు గురికావడంతోనే ఇంతటి పెను మార్పులని అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ సెలవిచ్చారు. అంటే ప్రపంచంలో ఏ దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా మన రూపాయి తట్టుకుని నిలబడేంత బలంగా లేదు. ఇంతటి బలహీనమైన రూపాయి ఎప్పుడు బలపడుతుందా అన్నదే అనుమానం. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చాక ద్రవ్యమారక రేట్లతో ప్రజా జీవనం తీవ్రంగా ప్రభావిత మవుతోంది. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చమురు ధరలకు నిర్ణయాత్మకమవుతోంది. రూపాయి మారకం విలువ పడిపోతోందని 2014 ఎన్నికలకు ముందు మోడీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మోడీ ఆయుష్మాన్ భారత్ ప్రకటించారు. అయితే రూపాయికి శస్త్రచికిత్స చేయకుండా దీనిని సాధించడం దుస్సాధ్యం. ఇది సాధిస్తే ప్రజలు ఎవరికి వారు ఆర్థికంగా ఎదగలరు. ఎవరి ఆరోగ్యం వారు చూసుకోగలరు. దివంగత ప్రధాని పివి నరసింహారావు మాత్రమే ఇలాంటి దార్శనికతను ప్రదర్శించారు. ఆయన తీసుకున్న సాహసోపేత సంస్కరణలే ఇప్పటికీ మనకు రక్షగా నిలిచాయి. ప్రధాని మోడీ ఇప్పుడు ఈ దిశగా దృష్టి సారించాలి. కఠిన పరిశ్రమ చేయాలి. ఎగుమతులు,దిగుమతులను విశ్లేషించాలి. తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితం ఇవ్వడం లేదని గుర్తించి అందుకు కారణాలు విశ్లేషించాలి. చమురు దిగుమతులే మన కొంప ముంచుతున్నాయని ఆర్థికవేత్తలతో సహా ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. విపరీతంగా పెరిగిన చమురు ధరల కారణంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరగి పోతున్నాయి. అంతేగాకుండా రూపాయి మారకవిలువ దిగజారిపోతోందని అంటున్నారు.

పివి-మన్మోహన్ ద్వయం తెచ్చిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలనే వాజ్‌పేయ్ ప్రభుత్వం అమలు చేసింది. అలాగే మన్మోహన్ సర్కారు బాటలోనే మోడీ ప్రభుత్వం నడుస్తోంది. కాబట్టి ఆ పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప నిజంగా మాత్రం కాదు.

రిజర్వు బ్యాంకు రంగంలోకి దిగి రూపాయిని నిలబెట్టాల్సిఉందని చాలామంది సూచిస్తున్నారు. 80శాతం చమురు ఎలాగూ దిగుమతి చేసుకొనేదే కనుక, క్రూడాయిల్ ధర పెరిగి, దేశీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల రేట్లు మరింత హెచ్చి నిత్యావసర, వినియోగ వస్తువులు ఖరీదు కాక తప్పదు. ఇప్పటికే ఇరాన్ చమురు కూడా కాదనుకుంటున్నందున చమురు లభ్యత మరింత తగ్గి కొత్త కష్టాలు ఎదురు కావచ్చన్న ఆందోళనా ఉంది. ద్రవ్యోల్బణం అదుపు చేయడానికి ఆర్‌బిఐ కష్టాలు పడుతున్న తరుణంలోనే రూపాయి మరింతగా కృశించిపోతున్నది. రూపాయిని కాపాడటానికి రిజర్వుబ్యాంకు వద్ద అనేక మార్గాలు ఉండివుంటాయని, తగిన సమయంలో నిర్ణయాలు చేస్తుందని ఆర్థిక నిపుణులు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ దుస్థితి ఎంతకాలం కొనసాగుతుందన్నది అర్థంకాని ప్రశ్న. రిజర్వుబ్యాంకు చర్యలు సామాన్యుడికి ఉపశమనం ఇవ్వలేని కాలం కూడా దాపురించవచ్చు. రూపాయి బలహీనతలను గుర్తించతగు శస్త్ర చికిత్సలకు దిగాలి. లేకుంటే ఆర్థిక ద్రవ్యోల్బణం,ధరల స్వారీ పెరగగలదు.

# కొంపముంచుతున్న ట్రంప్ వాణిజ్య విధానాలు

### చమురు ధరలూ సంక్షభానికి కారణాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): ఏ క్షణాన డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైనారో అప్పటినుంచి ఏ దేశానికీ ప్రశాంతత లేకుండాపోయింది. అమెరికా ఫస్ట్ నినాదంతో వాణిజ్య యుద్ధాలు ఆరంభించాడు. విదేశీ ఉత్పత్తులపై ఎడాపెడా సుంకాలు విధిస్తూ ప్రపంచ వాణిజ్య రంగాన్ని అతలాకుతలం చేస్తున్నారు. ఇరాన్‌తో కయ్యానికి దిగడంతో క్రూడ్ ఆయిల్ ధరలు ఆకాశాన్నంటి డాలర్లకు డిమాండ్ అధికంగా పెరిగిపోతున్నది. పెద్దనోట్ల రద్దు వంటిచర్యల కారణంగానే ఈ సంక్షోభం ఉత్పన్నమైందనీ, తన అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ మోదీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకును నోరులేనిదానిగా మార్చివేసిందని విపక్షాలు అంటున్నాయి. ఆర్థిక రంగంలో కొత్త ఉత్పాతాలను తట్టుకొని నిలబడగల స్థితిలో ప్రజలు లేరు.ద్రవ్యోల్బణం అదుపు తప్పితే మరిన్ని కష్టాలు తప్పవు. బ్యాంకు వడ్డీరేట్లు పెరగడం, రుణాలమీద ప్రభావం వంటి సమస్యలు కూడా అనేకం. రూపాయి పతనమవుతున్నందున పెట్టుబడిదారులు డాలర్ సురక్షితమైనదిగా భావించడంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా తరిగి పోతున్నాయి. డాలర్ విలువ కారణంగా వాణిజ్యలోటు హెచ్చుతూ ఐదేళ్ల గరిష్టానికి చేరింది. రూపాయి విలువ తగ్గుదలతో ఎగుమతులకు మేలు జరగవచ్చని కొందరంటున్నారు. అయితే ఇప్పటికే అమెరికా, ఐరోపా మార్కెట్లలో విధించిన నిబంధనలవల్ల వాటికి ముప్పు ఏర్పడిన వాస్తవాన్ని విస్మరించరాదు. అంతేగాక దిగుమతుల భారం వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాన్ని గుర్తించాలి. డాలర్లు మన దేశం నుంచి తరలి పోకుండా పరిమితం చేయడానికి విలాస వస్తువుల విచ్చలవిడి దిగుమతులపై ఆంక్షలు విధించడం అవసరం అన్న భావనా ఉంది. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు ఇప్పటికైనా మళ్లాల్సి ఉంది. టర్కీ ఆర్థిక సంక్షోభం స్టాక్‌మార్కెట్‌ను, కరెన్సీ మార్కెట్‌ను కుదిపేస్తున్నది. దాని సంక్షోభం ఇప్పట్లో తీరేదికాదన్న వాస్తవం మరింత భయపెడుతున్నది. లీరా పతనం వర్ధమాన మార్కెట్లన్నింటినీ ప్రభావితం చేసినప్పటికీ, భారతీయ రిజర్వు బ్యాంకు జోక్యం పూర్తిస్థాయిలో లేనందునే రూపాయి ఇంతగా ఉన్నదని కొందరి వాదన. రూపాయి పతనం ఐటీ, ఎగుమతులు ఇత్యాది రంగాలకు మేలుచేసుందని అంటున్నారు కానీ, సామాన్యుడిపై ధరాఘాతం తప్పడం లేదు. దిగుమతి చేసుకొనే ఉత్పత్తుల ధరలు పెరిగిపోతాయి.

## టీఆర్ఎస్ ప్రభుత్వం..
# ఎంఐఎం చేతిలో కీలుబొమ్మ

- కేసీఆర్ పనితీరు మాటల్లోనే.. చేతల్లో కనిపించడంలేదు
- కాళేశ్వరం నుంచి ఒక్కఎకరాకు నీరందించలేదు
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి పేరుకుపోయింది
- ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ

సంగారెడ్డి, ఆగస్టు17(నేటినిజం ప్రతినిధి) : టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎం చేతిలో కీలుబొమ్మలా మారిందని, ఎంఐఎం నేతలు ఏం చెబితే అలా పాలన సాగిస్తుందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరు మాటల్లోనే... కానీ చేతల్లో కనిపించడం లేదని ఘాటు విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి దృష్టి అంతా కాళేశ్వరంపైనే ఉంది కానీ ఇప్పటివరకు ఒక్క ఎకరాకు కూడా నీరందించలేదని ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మి పథకానికి ఐదునెలల నుంచి నిధులు మంజూరు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎక్కడ చూసినా అవినీతి పేరుకుపోయి రాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరంగా తయారయిందని.. దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని దత్తాత్రేయ డిమాండ్ చేశారు. అదేవిధంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా ప్రకటించాలని కోరారు. సంగారెడ్డి జిల్లాలోని 16 మండలాల్లో కరువు తాండవం చేస్తోందని, ఇందుకోసం తక్షణమే జిల్లాకు రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కేంద్రం నిధులు విడుదల చేసినా వాటిని ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ.. ఇప్పటికే ఈ ఎన్నికలపై ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. టీఆర్ఎస్ వైఫల్యాలను గ్రామ స్థాయిలో తీసుకెళ్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని, బలమైన నాయకత్వం లేకపోవటంతో పార్టీలో విశ్వసనీయత లోపించిందని అభిప్రాయపడ్డారు. మైనారిటీల రక్షణ కోసం ట్రిపుల్ తలాక్ బిల్లు తీసుకొచ్చామన్నారు. గ్రామ స్థాయిలో బీజేపీ పార్టీ బలోపేతం అవుతుందని దత్తాత్రేయ ధీమా వ్యక్తం చేశారు.

# అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

కరీంనగర్,ఆగస్ట్17(నేటినిజం ప్రతినిధి): వర్షాల కారణంగా గిరిజన మండలాల్లో విష జ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా ఈ సీజన్‌లో జ్వరాలు ప్రబలుతున్నా అధికారులుపెద్దగా పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం వల్లనే ఇలా జరగుతోందని మాజీమంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పారిశుద్ధ్య లోపం, తాగునీరు, దోమల సమస్యలతో విషజ్వరాలు ప్రబలి పలువురు మంచాన పడుతున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహనలోపంతో విషజ్వరాల తీవ్రత పెరిగిపోయినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటుచేయాలన్నారు. ఇదిలావుంటే కలెక్టర్ ఈ గ్రామల్లో పర్యటించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్యం, తాగునీటి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్యులను, సిబ్బందిని ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్ వేసి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు.ఈ ప్రాంతంలో ప్రబలుతున్న విషజ్వరాలపై అత్యవసర చికిత్స అవసరమయితే జిల్లా కేంద్రాలకు తరలించి ప్రత్యేక్ష పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపైన ఉందని అధికారులు అన్నారు.

## ఏపీ వార్తలు

# ధవళేశ్వరం వద్ద మళ్లీ పెరిగిన గోదావరి

### లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు

రాజమహేంద్రవరం,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): గోదావరి నదికి మళ్లీ వరదనీరు పోటెత్తుతోంది. ముంపు ప్రాంతాలు పూర్తిగా కోలుకోకముందే మరోసారి గోదారి ఉగ్రరూపం దాల్చుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో వర్షాలు లేకపోయినా.. ఎగువ నుంచి ప్రవాహం పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 41 అడుగులకు చేరగా.. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని వీరవరపు లంక కాఫర్ డ్యామ్ వద్ద వరద ఉధృతి పెరిగి చుట్టుపక్కల గ్రామాల్లోకి నీరు ప్రవహిస్తోంది. కడెమ వాగు వరద నీరు తొయ్యేరు రహదారులపైకి రావడంతో దేవీపట్నం వాసులు ఆందోళన చెందుతున్నారు.ఎగువ నుంచి నీటి ప్రవాహం స్థిరంగా ఉన్నందున, సాధ్యమైనంత వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. పంట కాల్వలకు 13,200 క్యూసెక్కులు సరఫరా చేస్తుండగా.. సముద్రంలోకి 5.23లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా దండంగి వద్ద సీతపల్లి వాగులోకి వరదనీరు వచ్చి చేరింది. వరద నీటి ప్రవాహంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గండిపోచమ్మ ఆలయం వద్ద వరద ఉధృతి అధికంగా ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం, వేలేరుపాడు మండలాల్లో పలుగ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. పోలవరం మండలం పొత్తూరు వంతెనపై వరద ప్రవాహంతో 19 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుగ్రామాల్లో పంటలు నీటమునిగాయి.

# డ్రోన్ల ద్వారా వరదను అంచనా వేస్తున్నాం

**అంతకంతకూ కృష్ణా నదికి పెరుగుతోన్న వరద**
**పరిస్థితిని వివరించిన ఇరిగేషన్ మంత్రి అనిల్ యాదవ్**
**ఎగువన వర్షాలతో పోటెత్తుతున్న కృష్ణమ్మ**

విజయవాడ,ఆగస్ట్17 (ఆంఎన్ఎ): ప్రకాశం బ్యారేజీకి మరింత వరద పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్‌శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. దాదాపు 7లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం వుందని ఆయన తెలిపారు. గంట గంటకూ నీటి నిటి మట్టం పెరుగుతోందని,ఈ మేరకు వరద పరిస్థితిని తెలుసుకునేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎగువ నుంచి వచ్చే వరద వల్ల కరకట్ట వెంబడి కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఆయా ప్రాంతాల్లోవరదల నుంచి ప్రజల్ని రక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టంచేశారు. అందులో భాగంగానే డ్రోన్‌ల సాయంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. వరదలపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కరకట్టమీద ఉన్నఇల్లు తనది కాదని చంద్రబాబు అన్నారు మరి ఇప్పుడు చంద్రబాబుకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదిలో వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. కృష్ణా, గుంటూరు జిల్లాలోని పలుప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, మోపిదేవి.. గుంటూరు జిల్లాలోని కొల్లూరు, కొల్లిపర, భట్టిప్రోలు, రేపల్లె, బాపట్ల మండలాల్లో వర్షం పడుతోంది. దీంతో వరద సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. కృష్ణా జిల్లాలో నదీపరీవాహక ప్రాంతమైన కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో వేలాది ఎకరాల పంట నీట మునిగింది. దీంతో అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదనీరు గ్రామాల్లోకి సైతం వచ్చి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వడవలతో వారు తమ ప్రాంతాలకు చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంచికచర్ల మండలం గణిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కొత్తపేట గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పత్తి, వరి, కంద, పెసర, పసుపు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చందర్లపాడు మండలంలోని కొడవటికల్లు, ఉస్తేపల్లి, ఏటూరు, పొక్కునూరు గ్రామాల్లో సైతం పంటలు దెబ్బతినడంతో పాటు పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లో వరద నీరు చేరింది. దీంతో అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద రహదారిపైకి వరదనీరు చేరింది

# చంద్రబాబుపై కుట్ర జరుగుతుంది

**- ట్విటర్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్**

అమరావతి, ఆగస్టు17(ఆంఎన్ఎ) : చంద్రబాబుపై కుట్ర జరుగుతుందని వైసీపీ సర్కార్‌పై మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం ఈమేరకు ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కుట్ర జరుగుతోందని, తాజా పరిణామాలన్నీ చూస్తే పరిస్థితి అలాగే ఉందన్నారు. అటు బాబు నివాసంలోకి వరద నీరు తెప్పించడానికి.. ఇటు ప్రాణహాని కలిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చంద్రబాబు ఇంట్లోకి వరదనీరు తెప్పించడానికి వైసీపీ నేతలు పగలూరాత్రిళ్ళు ఎలా కుట్రలు పన్నుతున్నారని, బ్యారేజీ గేట్లకు అడ్డంగా పడవలు ముంచారని అన్నారు. 3-4 గేట్ల నుంచి వరద ఉధృతికి బయటకి కొట్టుకొని వచ్చిన ఈ పడవే అందుకు సాక్ష్యం వీడియోను పోస్టు చేశారు. ఈ తెలివితేటలు పాలనలో ఎందుకు చూపించరు వీళ్ళు అంటూ ప్రశ్నించారు.

వైఎస్ జగన్.. అమెరికాకు వెళ్తూ చంద్రబాబుకి ప్రాణహాని కలిగించమని మీ వాళ్ళకు ప్లాన్ ఇచ్చి వెళ్ళారా? జెడ్ ప్లస్ క్యాటగిరీ భద్రత కలిగిన మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై అనుమతి లేకుండా డ్రోన్లు ఎందుకు ఎగిరాయి అంటూ ప్రశ్నించారు. డ్రోన్ తో ఉన్న బాక్సులో ఏముందని, వాళ్ళు మీ పేరెందుకు చెప్పారంటూ ప్రశ్నించారు.

# జనసేనను ఏ పార్టీలో కలపబోం

**- నా బలమేంటో.. బలహీనతేంటో నాకు తెలుసు**
**- జనసేన అధినేత పవన్ కళ్యాణ్**

అమరావతి, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : జనసేన పార్టీని ఏ పార్టీలోనూ విలీనం చేయబోమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. శుక్రవారం జనసేన కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని నేతలతో పవన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జనసేన పార్టీని తమ పార్టీలో కలిపేయాలంటూ ఒక పెద్దపార్టీ తనపై ఒత్తిడి తీసుకువస్తోందని వెల్లడించారు. అయితే, జనసేనను ఏ పార్టీ లోనూ విలీనం చేసేది లేదని పవన్ స్పష్టం చేశారు. జాతి సమగ్రతని కాపాడటానికి, మానవతా విలువల కోసం పెట్టిన పార్టీ జనసేన అని.. అందుకే జనసేనను ఏ పార్టీలోనూ కలపబోనని పవన్ తేల్చి చెప్పారు. తాను సత్యం కోసం పనిచేసే వాడినని, ఎవరికైనా అభిప్రాయాలు ఉంటే చెప్పాలని కోరారు. అలా కాకుండా రోడ్ మీదకు వెళ్లి, సోషల్ మీడియాలో చెప్తే వినటానికి ఇదేం కాంగ్రెస్ పార్టీ కాదని నేతలు, కార్యకర్తల నుద్దేశించి వ్యాఖ్యానించారు. నా బలం నాకు తెలుసు.. నా బలహీనత నాకు తెలుసని పేర్కొన్నారు. జనసైనికులు అంతా వందబాధి తొంలకం చేయూతనివ్వాలని పవన్ పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అభి వానంల అత్యుత్సాహంపైపవన్.. మీతో కలిసి ఫోటోలు దిగటానికి ఇబ్బందేమీ లేదు. అయితే ఒకేసారి అందరూ మీద పడిపోవడం వల్ల కొంచెం ఇబ్బంది అవుతోంని చెప్పారు.

# మోదీ దృక్పథం బాగుంది

**- ప్రధాని మోదీపై చిదంబరం ప్రశంసలు**

న్యూఢిల్లీ, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగంలోని మూడు అంశాలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ప్రశంసించారు. జనాభా పెరుగుదల భవిష్యత్తు తరాలను ఏ విధంగా నాశనం చేస్తుందో మోదీ వివరించిన విధానం బాగుందన్నారు. స్వాతంత్య దినోత్సవ సందర్భంగా ప్రధాని చేసిన ఈ మూడు ప్రకటనలను మనమందరం స్వాగతించాలని తెలిపారు.

చిన్న కుటుంబాలను కలిగి ఉండటమే దేశభక్తి, ప్లాస్టిక్ నిషేధం దిశగా చర్యలు, సంపద సృష్టికర్తలను గౌరవించాలి అన్న మోదీ మాటలను చిదంబరం ట్విటర్‌లో ఉటంకించారు. కాగా ఎర్రకోటలో తన ప్రసంగంలో భాగంగా జనాభా విస్ఫోటనం, ప్లాస్టిక్ నిషేదం, సంపద సృష్టి కర్తలను గౌరవించడం తదితర అంశాలపై మోదీ మాట్లాడిన విషయం తెలిసిందే. సంపద సృష్టి గొప్ప జాతీయ సేవ అని మోదీ అన్నారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి తీవ్ర ఆటంకం కలిగిస్తుందని, దీనిపై అక్టోబర్ 2 నాటికి మార్పు తీసుకు రావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ మూడు అంశాలపైన ప్రధాని దృక్పథం బాగుందని చిదంబరం కొనియాడారు. మొదటి, చివరి సందేశాలను ఉద్దేశించి ప్లాస్టిక్ నిషేదం, జనాభా నియంత్రణ అంశంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, దీనికోసం వందలమంది వాలంటీర్లు క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని చిదంబరం సూచించారు. ఇదిలా ఉంటే చిదంబరం వ్యాఖ్యల పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ప్రధానిని పొగడటం సరికాదని, కాంగ్రెస్ హయాంలో ఇంతకంటే ఎక్కువగానే అభివృద్ధి పనులు చేశామని, ఇప్పుడు రెండుమూడు మంచి పనులు చేయగానే పొగత్తలు సరికాదని పేర్కొంటున్నారు.

# మట్టి వినాయకుల పంపిణీకి ఏర్పాట్లు

హైదరాబాద్,ఆగస్టు17(ఆర్ఎన్ఎ): ఓ వైపు పక్కా ప్రణాళికతో పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు పర్యావరణహితంగా పండగలు జరుపుకొనేలా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) నగరవాసుల్ని ప్రోత్సహిస్తోంది. రూ.11.60 లక్షలతో 40 వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే గుత్తేదారు ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి 8 అంగుళాల ప్రతిమలను తయారు చేసే బాధ్యతను అప్పగించింది. పండగ ముందు హడావుడి చేయడం కాకుండా నాలుగైదు రోజుల ముందు నుంచే ప్రతిమలను పంపిణీ చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. లుంబినీ పార్కు, సంజీవయ్య పార్కు, ఎన్టీఆర్ గార్డెన్స్, నెక్లెస్ రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లోని హెచ్ఎండీఏకు చెందిన పార్కుల్లో ప్రత్యేకంగా పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంతో పాటు బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ(బీపీపీఏ) కార్యాలయంలో ప్రతిమలను అందుబాటులో ఉంచనున్నారు.

## రాజకీయ పబ్బంకోసం.. టీడీపీ నేతలు డ్రామాలు

**- కరకట్ట మీదున్న ఇల్లు నాదికాదన్నారు**
**- ఇప్పుడు చంద్రబాబుకు వచ్చిన ఇబ్బందేమిటి**
**- వరద తీవ్రత అంచనా కోసమే డ్రోన్లను వినియోగించాం**
**- మంత్రి అనిల్‌కుమార్ యాదవ్**

అమరావతి, ఆగస్టు17 (ఆర్ఎన్ఎ) : రాజకీయ పబ్బంకోసం టీడీపీ నేతలు డ్రామాలా డుతున్నారని ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కరకట్ట మీద ఉన్న ఇల్లు నాదికాదన్న చంద్రబాబుకు.. ఇప్పుడు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. ప్రైవేటు ప్రాపర్టీ కాదని గతంలోనే చంద్రబాబు చెప్పారని, ఆ ఇల్లు మునిగిపోతుందన్న విషయం బయట ప్రపంచానికి తెలియనీయకూడదని బాబు డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఆయన చేసిన తప్పులను ప్రజలకు తెలియనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. వరద వస్తే చంద్రబాబు ఇల్లు మునిగిపోతుందని తాము ఎప్పుడో చెప్పామన్నారు. నేడు ఇసుక బస్తాలు వేసి ఆ నీరు పూర్తిగా ఇంటిలోకి రానీయకుండా అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఆ ఇల్లు నాది కాదని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు మాట మార్చి.. నాదే అని ఎలా అంటున్నారని ప్రశ్నించారు. ఐదేళ్లలో వర్షాలు పడలే దని..దీంతో ప్రకాశం బ్యారేజీకి నీరు రాక పోవడంతోనే చంద్రబాబు ఇల్లు మునిగిపోలేదన్నారు. వరదొచ్చి ఉంటే తన ఇల్లు మునిగిపోకుండా రైతులకు నీరివ్వడం మాని.. చంద్రబాబు గేట్లు ఎత్తించేవారన్నారు. చంద్రబాబు ఇకనైనా డ్రామాలు ఆపాలని.. ప్రభుత్వ విధులను అడ్డుకోవద్దని హితవు పలికారు. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు వచ్చే అవకాశముందని మంత్రి అన్నారు. దాదాపు 7 లక్షల క్యూసెక్కుల నీరు చేరే పరిస్థితి కనబడుతుందన్నారు. గంట గంటకూ నీటి మట్టం పెరుగుతోందన్నారు. వరద పరిస్థితి అంచనా వేయడానికి గత మూడు రోజులుగా డ్రోన్లు వినియోగిస్తున్నామన్నారు. ఎగువ నుంచి వచ్చే వరదతో కరకట్ట వెంబడి కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజల రక్షణ.. ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. డ్రోన్ల సాయంతో వరద పరిస్థితి ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని తెలిపారు.

## పశువులకాపరి దారుణ హత్య

కర్నూలు,ఆగస్ట్17 (ఆంఎన్ఎ): గుర్తు తెలియని వ్యక్తులు పశువులు మేపుకుంటూ జీవిస్తున్న ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన కర్నూలు జిల్లా గడివేముల మండలంలోని ఎల్కే తండాలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన కృష్ణ గత కొంతకాలంగా బతుకు తెరువుకోసం ఎల్కే తండాలో ఓ యజమాని వద్ద ఆవులు కాపరిగా ఉంటున్నాడు. గురువారం రాత్రి గ్రామ శివారులో ఉన్న ఆవుల మందవద్ద కృష్ణ పడుకోవడానికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున ఆయనను లేపేందుకు యజమాని వెళ్లగా కృష్ణ రక్తపుమడుగులో కనిపించాడు. దీంతో యజమాని వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులెవరో కృష్ణ తలపై మోది హత్యకు పాల్పడినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియడంలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

# చంద్రబాబు నివాసంపై డ్రోన్ చక్కర్లు

**- తన నివాసం వద్ద భద్రతపై బాబు ఆందోళన**
**- డీజీపీ, ఎస్పీకి ఫోన్‌చేసి ఆగ్రహం వ్యక్తంచేసిన బాబు**
**- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు**

అమరావతి, ఆగస్టు17(ఆంఎన్ఎ) : కృష్ణా నది వరదలపై ఓ పక్క అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల వర్షం కురుస్తుండగా శుక్రవారం దానికి మరింత ఆజ్యం పోసే ఘటన జరిగింది. తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద ఇద్దరు వ్యక్తులు డ్రోన్ ప్రయోగించారు. ఈ విషయాన్ని గమనించిన టీడీపీ నేతలు ఆ వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు దేవినేని అవినాష్, టీడీ జనార్ధన్ వెంటనే అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. పోలీసులు నిజాలు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారంటూ పోలీసు జీపుకు అడ్డంగా బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తన నివాసంపై డ్రోన్ ఎగరడంపై మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. వెంటనే డీజీపీ, కృష్ణా జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి నిలదీశారు. డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎక్కడా డ్రోన్లు ఎగరవేయడానికి వీల్లేదని, అలాంటిది ప్రతిపక్ష నేత ఇంటిపైనే డ్రోన్లు ఎగరడం ఏంటని ప్రశ్నించారు. హై సెక్యూరిటీ జోన్ ఉండే తన నివాసంపై డ్రోన్లు ఎందుకు ఎగరవేశారో తనకు సమాధానం చెప్పాలన్నారు. మాజీ ముఖ్య మంత్రి భద్రతనే ప్రశ్నార్థకంగా మారుస్తారా? అని మండిపడ్డారు. డ్రోన్లు ఎగరేస్తూ పట్టుబడిన వ్యక్తులెవరో, ఆ డ్రోన్లలో ఏముందో, దాని వెనుక కుట్ర ఏమిటో వెంటనే దర్యాప్తు చేపట్టి తెలియ జేయాలని డీజీపీ, కృష్ణా జిల్లా ఎస్పీని చంద్రబాబు డిమాండ్ చేశారు.

# బాబు ఇంటిచుట్టూ ఆళ్ల తిరుగుతున్నారు

**- ఇంటిపైకి వరదవెళ్లేలా కుట్రలు చేస్తున్నారు**
**- కృష్ణానది ప్రవాహంపై ముందస్తు చర్యలు తీసుకోలేదు**
**- రాజధాని భూముల్లోకి వరద రావాలని కుట్రలు చేస్తున్నారు**
**- వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డ టీడీపీ నేత దేవినేని ఉమ**

అమరావతి, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ఎలాంటి అనుమతి లేకుండా చంద్రబాబు ఇంటిపై డ్రోన్ ప్రయోగించారని , ప్రతిపక్ష నేత ఇంటిపై డ్రోన్‌లు వినియోగించడం అంటే ఇది కుట్రపూరితమేనని మాజీ మంత్రి దేవినేని ఉమ ఆరోపించారు. చంద్రబాబు ఇంటిపై డ్రోన్‌ను ప్రయోగించిన విషయమై ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డ్రోన్ ప్రయోగించిన వ్యక్తుల దగ్గర ఎలాంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. పోలీస్ యంత్రాంగం ఏం చేస్తోందని దేవినేని ఉమ ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు ఇంటిపైకి వరద వెళ్లేలా కుట్రలు చేస్తున్నారని దేవినేని ఉమ ఆరోపించారు. కృష్ణానది ప్రవాహంపై ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాజధాని భూముల్లోకి వరద రావాలని కుట్రలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం దుర్మార్గాలకు పాల్పడుతోందని దేవినేని ఉమ మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ ఆదేశాలతోనే కిరణ్ అనే వ్యక్తి డ్రోన్ పంపించారని ఆరోపించారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి నాలుగు రోజులుగా.. చంద్రబాబు ఇంటి చుట్టూ తిరుగుతున్నారని దేవినేని ఉమ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు భద్రతకు ముప్పు ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు ఇంటిని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించాలని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. భౌతికంగా నష్టం కలిగించాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. సీఎం జగన్ ఇంట్లో పనిచేసే కిరణ్‌కు చంద్రబాబు ఇంటికి డ్రోన్లను పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే ఓవర్ యాక్షన్ చేస్తున్నాడని ఆరోపించారు. చంద్రబాబు ఇంటికి వెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మిమ్మల్ని చంద్రబాబు ఇంటికి కాపలా కాయమని ఆదేశాలు ఇచ్చారా? అని నిలదీశారు. బాంబులు వేయాలని చూస్తున్నారా? అని దేవినేని ప్రశ్నించారు.

# అన్నక్యాంటీన్ల కోసం టిడిపి ఆందోళన

ఒంగోలు,ఆగస్టు17(ఆర్ఎన్ఎ): అన్న క్యాంటీన్లను కొనసాగించాలని కోరుతూ ఒంగోలులో టిడిపి ఆందోళనకు దిగింది. ఒంగోలు-కర్నూలు రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం తెదేపా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి అన్న క్యాంటీన్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష్యతో పేదల కడుపుకొట్టే పనులు మానుకోవాలని సూచిం చారు. పేదలకు పట్టెడన్నంపెట్టాలన్న ఓ మంచి కార్యక్రమాన్ని జగన్ ప్రభుత్వం జీర్ణించుకోలేదన్నారు. పేదలు క్యాంటీన్లు కొనసాగించాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోరని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు డి.వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు, మహిళా నాయకురాళ్లు కుసుమకుమారి, ఎన్.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు

# తిరుపతికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

### లారీని ఢీకొన్న వాహనం: ఏడుగురికి గాయాలు

తిరుపతి,ఆగస్ట17 (ఆంఎన్ఎ): దైవదర్శనం చేసుకుని ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి దైవదర్శనం చేసుకుని తుఫాన్ వాహనంలో ఓ కుటుంబం తమ ఇంటికి తిరుగుపయనమయ్యారు. గుడ్లూరు మండలంలోని చేవూరు వద్దకు వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పులికాట్ సరస్సులో బోల్తాపడ్డ పడవ

**చిన్నారులకు తప్పిన ముప్పు**

నెల్లూరు,ఆగస్ట17 (ఆంఎన్ఎ): తడ మండలం ఇరకం దీవి నుంచి బీములవారి పాలెం ఒడ్డుకు సుమారు 35 మంది ప్రయాణికులు, విద్యార్థులతో వస్తున్న పడవ ప్రమాదవశాత్తు శుక్రవారం పులికాట్ సరస్సులో బోల్తాపడింది.

ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పడవలో ఉన్న చిన్న పిల్లలను పెద్దవారు రక్షించి సమీపంలో వస్తున్న మరో పడ వలోకి సురక్షితంగా ఎక్కించారు. ఇది గమనించిన అక్కడే ఉన్న మరి కొన్ని పడవలు ఒడ్డుకు చేరుకున్నారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి!

**- దేవాలయాల విశిష్ఠతను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉంది**
**- పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస్‌రావు**

శ్రీకాకుళం, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడలు, యువజనసర్వీసులు, పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం రోడ్డు, భవనాలశాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీకూర్మం, అరసవల్లి, శ్రీముఖలింగంతో కలిపి మూడు ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని అన్నారు. వాటిని అభివృద్ధిపర్చడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సూర్యదేవాలయం కేవలం శ్రీకాకుళంలోనే ఉందన్నారు ఈ దేవాలయ విశిష్టతను తెలియజేయవలసిన ఆవశ్యకత ఉన్నదన్నారు. సాలిహుండం, బారువ బీచ్‌ను అరకు, బొర్రా గుహలతో సమానంగా అభివృద్ధి పరచనున్నామని తెలిపారు దేవాలయాలతోపాటు పర్యాటకంగానూ జిల్లాను అభివృద్ధి చేస్తామని, ఉత్తరాంధ్రను పర్యాటకంగా అభివృద్ధి పరచి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుపుతామని తెలిపారు అంతర్జాతీయ క్రీడాకారులు జిల్లాలో ఉన్నారని అంటూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న స్టేడియంలను పూర్తిచేస్తామన్నారు. ఈసందర్భంగా రోడ్డు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలు, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు జిల్లాలోని పురాతన దేవాలయాలను సైతం పునరుద్ధరిస్తామన్నారు.

## మహారాష్ట్రలో పొత్తులపై..

# కాంగ్రెస్ కసరత్తు

**- ఎన్సీపీని కలుపుకొని ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళిక**
**- సోనియాతో భేటీ అయిన రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ**

న్యూఢిల్లీ, ఆగస్టు 17(ఆంఎన్ఎ) : ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఘోర వైఫల్యాన్ని చవిచూసిన కాంగ్రెస్ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీకి ఆ రాష్ట్రంలో గట్టి పోటీ ఇచ్చేందుకు పట్టుదలతో ఉంది. శరద్ పవార్ నేషనలిస్ట్ పార్టీ (ఎన్సీపీ)ని కలుపుకొని వెళ్లడంతో పాటు తమతో కలిసొచ్చే అన్ని పార్టీలను దగ్గరకు చేర్చుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎంపీసీసీ) ప్రతినిధి బృందం పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఆమె నివాసంలో శుక్రవారం కలుసుకుంది. ఎన్నికల్లో సీట్ల పంపకంకు సంబంధించిన ఫార్ములాపై సమావేశంలో సోనియా ప్రస్తావించారని, నాయకుల అభిప్రాయాలను, సూచలనలను అడిగి తెలుసుకున్నారు. కాగా సమావేశం అనంతరం ఎంపీసీసీ అధ్యక్షుడు బాలాసాహెబ్ థోరట్ విలేకరులతో మాట్లాడారు.. రాజ్‌థాకరే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్)తో సమన్వయానికి సంబంధించి ఇంకా ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన తెలిపారు. అయితే ఇతర పార్టీలతో పొత్తుల వ్యవహారంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. ఎన్సీపీతో పొత్తుల చర్చలు తుది దశకు వచ్చినట్లు చెప్పారు. కాగా, మహారాష్ట్రలో తమ చిరకాల భాగస్వామి అయిన శివసేనతో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు కొనసాగుతుందని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది.

# తమిళనాట కుల బ్యాండ్స్ కలకలం

**విద్యార్థుల్లో విష బీజాలు నాటేయత్నం**
**కఠిన చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం**

చెన్నై,ఆగస్టు17(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కులబ్యాండ్స్ వివాదం కలకలం సృష్టించింది. దీంతో కులాల పరంగా బ్యాండ్స్ ధరించవద్దని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళని స్వామి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల కులం గుర్తించటానికి చేతులకు బ్యాండ్స్ కట్టుకోవాలని కొన్ని స్కూల్స్ ఆదేశాలు జారీ చేయడంతో నిమ్న కుల సంఘాలు బ్యాండ్స్ ధరించడంపై మండిపడుతున్నాయి. విద్యాశాఖ మంత్రి కెఏ సెంగోట్టయన్ కుల బ్యాండ్స్‌పై ఇప్పటి వరకు స్పందించలేదు. గత కొన్ని రోజులు నుంచి పాఠశాలలో వివిధ కులాల పిల్లలను గుర్తించ దానికి బ్యాండ్స్ ధరించాలని విద్యార్థులకు యజమాన్యాలు సూచించాయి. ఎర్రపు, పసుపు, ఆకుపచ్చ, కుంకుమ పువ్వు రంగు గల బ్యాండ్స్ ధరిస్తే నిమ్న కులాలు, అగ్ర కులాలను గుర్తించవచ్చని కొన్ని పాఠశాల యజమాన్యాలు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆ రాష్ట్ర విద్యాశాఖ స్పందించింది. ఎవరు బ్యాండ్స్ ధరించవద్దని హెచ్చరించింది. కులం పరంగా బ్యాండ్స్ కట్టుకోవాలని ఏ పాఠశాల యజమాన్యాలు బలవంతం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్నేహితుల దినోత్సవం, పలు వేడుకలలో మాత్రమే బ్యాండ్స్ ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. కుల పరంగా విద్యార్థులను వేరు చేయొద్దని తమిళనాడు మత్స్య శాఖ మంత్రి డి జయకుమార్ ఆ పాఠశాలలకు తెలియజేశారు.

అన్ని కులాల వారి కోసం తమిళనాడు ప్రభుత్వం పని చేస్తోందని ఆయన వివరించారు.

# పటేల్ అఖండ భారత్ కల నెరవేర్చాం

**370 రద్దుతో దేశాన్ని ఏకం చేశాం**
**కాశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధికి బాటలు వేశాం**
**ఇంతకాలం కాంగ్రెస్ రాజకీయం చేసిందన్న అమిత్ షా**

చండీఘడ్,ఆగస్ట17 (ఆర్ఎన్ఎ): సర్దార్ వల్లభాయ్ పటేల్ కోరుకున్న అఖండ భారత్ కలను సాకారం చేశమని, 370 ఆర్టికల్ రద్దుతో అది నెరవేరిందని కేంద్రహోం మంత్రి అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ళలో చేయలేని పనిని తాము 75 రోజుల్లో చేసి చూపించామని కేంద్రహోం మంత్రి అమిత్‌షా అన్నారు. 70 ఏళ్ళ వరకు ఆర్టికల్ 370 పై కాంగ్రెస్ పార్టీ లేనిపోని రాజకీయాలు చేసిందని, కానీ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే రద్దు చేశామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు కీలక మైలురాయి అని అమిత్‌షా అన్నారు. దీని వల్ల జమ్మూకశ్మీర్ అభివృద్ధితో పాటు, దేశ సమైక్యత, సమగ్రతకు పాటు పడ్డామని వివరించారు.హర్యానాలోని జింద్ జిల్లాలో జరిగిన 'ఆస్థా ర్యాలీ' లో అమిత్‌షా పాల్గొన్నారు. కేవలం ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ 370 ని రద్దు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశ అఖండతా కోసం,ఏకతా కోసమే దానిని రద్దు చేశామని తెలిపారు. 370 ని రద్దు చేసినందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, అటక్ నుంచి కటక్ వరకూ అందరూ మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారని షా ఆనందం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధిని ఆర్టికల్ 370 అడ్డుకుందని, ఎప్పుడైతే తాము 370 ని రద్దు చేశామో అప్పటి నుంచి ఇక కశ్మీర్, లడ్డాఖ్ ప్రాంతాలు అభివృద్ధిలో శీఘ్ర గమనంతో దూసుకెళ్తాయని, అలాగే తీవ్రవాదం అంతమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు ఓటుబ్యాంకు కోసమే కాంగ్రెస్ పార్టీ లాలూచీ పడిందని, కానీ ప్రధాని మోదీ ఓటుబ్యాంకు కోసం ఎన్నడూ లాలూచీ పడలేదని, కేవలం దేశ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొనే నిర్ణయాలు తీసుకున్నారని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు రాబోయే హర్యానా ఎన్నికల్లో తిరిగి బీజేపీ విజయం సాధిస్తుందని, గతం కంటే మరింత మెజారిటీని సాధిస్తామని అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. త్రివిధ దళాలకు సంబంధించి చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియమించనున్నట్లు ప్రధాని ప్రకటనపైనా ఈ సందర్భంగా ప్రశంసల వర్షం కురిపించారు. దీనివల్ల మన రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.

ఏళ్లుగా కశ్మీర్ మన దేశంలో అంతర్భాగంగా ఉందని చెప్పుకొంటున్నా.. ఆర్టికల్ 370 వల్ల ఇన్నాళ్లూ అది సాధ్యపడలేదన్నారు. ఇప్పుడది సాకారమైందన్నారు. దీని వల్ల జమ్మూకశ్మీర్, లేహ్, లద్దాఖ్ అభివృద్ధికి అడ్డంకి తొలగిందన్నారు. ఈ సందర్భంగా హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌పైనా ప్రశంసల వర్షం కురిపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శక విధానాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. రానున్న రెండు నెలల్లో హరియాణా అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అమిత్‌షా ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

# కరాచీకి నడిచే థార్ ఎక్స్‌ప్రెస్ రద్దు

**పాక్ నిర్ణయాలకు అనుగుణంగా రైల్వేశాఖ నిర్ణయం**

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి పాకిస్తాన్‌లోని కరాచీ వరకు నడిచే థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును భారత్ రద్దు చేసింది. ప్రతీ శుక్రవారం ప్రయాణం కొనసాగించాల్సిన ఈ రైలు ఇకపై నడవదని వాయువ్య రైల్వే సీపీఆర్వో అభయ్ శర్మ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు రైలు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. జోధ్‌పూర్-కరాచీ మధ్య నడిచే థార్ లింక్ ఎక్స్‌ప్రెస్‌ను భారత్ తాత్కాలికంగా రద్దు చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ ఈ రద్దు అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. శుక్రవారం ఈ రైలులో వెళ్లేందుకు 45 మంది టికెట్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. భారత్ భూభాగంలో జోధ్‌పూర్‌లోని భగత్ కీ కోఠి రైల్వే స్టేషన్ నుంచి భారత్-పాక్ సరిహద్దు వద్ద గల మునాబావ్ రైల్వేస్టేషన్ వరకూ ఈ రైలు నడుస్తుంది. అయితే, తమ వైపున నడిచే థార్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు పాక్ రైల్వే మంత్రి షేక్ రషీద్ ఆగస్టు 9న ఇస్లామాబాద్‌లో ప్రకటించారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, రాష్ట్ర విభజన తర్వాత పాక్ భారత్‌తో దౌత్య సంబంధాలు తగ్గించుకుంటున్న సంగతి తెలిసిందే.

# శంషాబాద్ వరకు మెట్రో పొడిగింపు

**-వెల్లడించిన ఎండి ఎన్వీఎస్ రెడ్డి**

హైదరాబాద్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): శంషాబాద్ అంతర్జాతీయ విమానశ్రయం వరకు మెట్రో పొడిగింపు పరిశీలనలో ఉందని మెట్రో ఎండీ ఎన్వీఎన్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి పనులను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాక మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో కారిడార్ పనులు ప్రారంభిస్తామని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మైండ్‌స్పేస్ జంక్షన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల దూరాన్ని రూ.5 వేల కోట్లతో పనుల అంచనా వేసినట్లు పేర్కొన్నారు. హైటెక్ సిటీ నుంచి మైండ్‌స్పేస్ జంక్షన్ వరకు జరుగుతున్న పనులు చివరి దశలో ఉన్నాయి.

రెండు నెలల్లో పనులు పూర్తి చేసి మైండ్‌స్పేస్ స్టేషన్ కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. హైటెక్‌సిటీ రివర్సల్ సౌకర్యం పూర్తయింది. భద్రత అనుమతులు వచ్చాక నాలుగైదు రోజుల్లోనే ట్విన్ సింగిల్‌లైన్ విధానం అమలు చేస్తామన్నారు. హైటెక్ సిటీ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు అవసరాన్ని బట్టి మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ 5 నుంచి 3 నిమిషాలకు కుదిస్తామని తెలిపారు. ఈనెల 14వ తేదీన ఒక్క రోజే మెట్రోలో అత్యధికంగా మూడు లక్షల ఆరువేల మంది ప్రయాణం చేశారని వెల్లడించారు.

## ఘనంగా రాఘవేంద్ర ఆరాధనోత్సవాలు

హైదరాబాద్,ఆగస్టు17(ఆర్ఎన్ఎ): బర్కత్‌పురంలో రాఘవేంద్రస్వామివారి దేవాలయంలో 348వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 18వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు అష్టోదకం, పాదపూజ, విశేష ఫల పంచామృతం, అలంకార సేవ, పారాయణం జరిగాయి. సాయంత్రం రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

**వైరా రిజర్వాయర్‌లో చేపలను వదిలిన కమల్ రాజు**

ఖమ్మం,ఆగస్టు17 (ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. రాష్ట్రంలోని మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకునేందుకు ఉచితంగా చేప పిల్లలను చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్స్యకారులు స్వేచ్ఛగా చేపలను పట్టుకుని అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. జిల్లా నియోజకవర్గ కేంద్రంలోని వైరా రిజర్వాయర్‌లో చేపపిల్లను వదిలారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మత్స్యకారులకు వంద శాతం ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, వైరా ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ ప్రారంభించారు. వైరా రిజర్వాయర్‌లో 14 లక్షల 50 వేల చేపపిల్లలను విడుదల చేసేందుకు జిల్లా మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది. మొదటి విడతగా ఐదు లక్షల పిల్లలను ఎమ్మెల్యే జడ్పీ చైర్మన్ చేతుల మీదగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ మత్స్యకారులకు ఉచితంగా వాహనాలు వలలు అందించడం జరిగిందని తెలిపారు. 20 కోట్ల చేపపిల్లలను ఐదు కోట్ల రొయ్యల పిల్లలను ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

## ఏపీ వార్తలు

## పాకిస్థాన్ సొంత విధ్వంసాన్ని కోరుకుంటోంది

**రాం మాధవ్ ఘాటు వ్యాఖ్య**

న్యూఢిల్లీ,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ఐక్యరాజ్యసమితి తలుపుతట్టడం భారత్ కంటే పాకిస్తాన్‌కే ఎక్కువ నష్టమని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి రామ్‌మాధవ్ అన్నారు. ఈ పరిణామంతో భారత్‌కు ఎలాంటి నష్టమూ సంభవించదని, పాకిస్తాన్ నష్టపోయి, ప్రపంచం ముందు నవ్వులపాలవుతుందని స్పష్టం చేశారు. తనను తాను ధ్వంసం చేసుకునే దిశగా పాకిస్తాన్ కదులుతోందని, భారత్‌కే లేశమాత్రం కూడా నష్టం లేదని రామ్‌మాధవ్ అన్నారు. కావాలనే యుద్ధప్రేలాపనలు చేస్తోందని అన్నారు. యుద్ధం వల్ల ఏం జరుగుతందో పాక్÷-కు బాగా తెలుసున్నారు. గతాన్ని మరి ఆ దేశం రంకెలు వేస్తోందన్నారు. జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో అందరూ సంతోషంగా ఉన్నారని, అందరూ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కశ్మీర్ ప్రజానీకం నిండు మనసుతో స్వాగతిస్తున్నారని రామ్‌మాధవ్ తెలిపారు. దేశంలో 370 రద్దుతో ప్రశాంతత ఏర్పడి భారత్ ఐక్యత చాటిందన్నారు.

# చంద్రబాబు ఇల్లు ఖాళీ చేస్తే మంచిది

**- ఇంటికోసం ప్రభుత్వాన్ని కోరితే పరిశీలిస్తాం**
**- వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు**

అమరావతి, ఆగస్టు17(ఆంఎన్ఎ) : వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా ఉంటే.. వరద నా కొంప ముంచడానికే వస్తోందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన చెందుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. హై సెక్యురిటీ జోన్‌లో ఉన్న చంద్రబాబు ప్రమాదకరమైన ఇంట్లో ఎందుకు వుంటున్నారని ప్రశ్నించారు. కృష్ణానదికి ఈ స్థాయిలో వరద రావడం చాలా అరుదున్నారు. ఆర్టికల్ 370 రద్దుతో పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు వచ్చినంత కోపం కృష్ణా వరదలతో చంద్రబాబుకు వచ్చిందని అన్నారు. ఆయన నివాసం అక్రమ కట్టడమని, నది ప్రవాహంలో ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందే చెప్పినట్లు ఆయన గుర్తుచేశారు. అయినా చంద్రబాబు తప్పని తెలిసికూడా మొండిగా అక్కడే వుంటున్నారని విమర్శించారు. వరదలతో చంద్రబాబు నివాసం మునిగిపోతే.. గత ఎన్నికల్లో ఓటమితో రాజకీయంగా చంద్రబాబు కొంప ఎప్పుడో మునిగిపోయిందని ఎద్దేవా చేశారు. నీచమైన ప్రచారాల వల్లే ప్రజలు మిమ్మల్ని ఛీ కొట్టారని, ఇంటి విషయంలో తప్పు చేస్తూ దాన్ని కప్పిపుచ్చుకునేందుకు అనేక తప్పులు చేస్తున్నారని అన్నారు. నోటీస్ ఇచ్చేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని కూడా రానివ్వకుండా అడ్డుకున్నారని, తక్షణమే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడం మంచిదని అంబటి సూచించారు. తప్పును సరిదిద్దుకోకపోతే ప్రకృతి ప్రకోపానికి గురి అవుతారని, మీక్షేమం కోసం చెబుతున్నామని అంబటి అన్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి అమరావతిలో సొంత ఇల్లు ఎందుకు కట్టుకోలేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదాలో ప్రభుత్వ ఇల్లు ఏర్పాటు కోసం చంద్రబాబు కోరితే పరిశీలిస్తామని అంబటి రాంబాబు అన్నారు.

# అవసరమైతే అణ్వాయుధమే!

**- భవిష్యత్తులో ఏం జరుగుతుందనేది పరిస్థితులపై ఆధారపడుంది**
**- అణ్వాస్త్ర ప్రయోగంపై రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు**

జైపూర్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : రానున్న కాలంలో పరిస్థితుల దృష్ట్యా అవసరమైతే అణ్వాయుధాల వినియోగానికి అవకాశముందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఓ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు రాజస్థాన్‌లోని జైసల్మేర్ వెళ్లిన రాజ్‌నాథ్.. అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రథమ వర్ధంతి సందర్భంగా పోఖ్రాన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ వాజ్‌పేయీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ అణ్వస్త్ర వినియోగంపై ఆయన మాట్లాడుతూ.. మొదట ప్రయోగించరాదన్నది ప్రస్తుతం దేశ విధానంగా ఉందని, దీనికి భారత్ కట్టుబడి ఉందని చెబుతూనే.. భవిష్యత్తు పరిణామాలపై ఏమీ చెప్పలేమని ఆయన పేర్కొనడం చర్చనీయాంశమైంది. భారత్‌ను అణ్వస్త్ర శక్తిగా మార్చాలన్న అటల్‌జీ ఆశయానికి సాక్షీభూతమైన ప్రదేశం పోఖ్రాన్ అని, మొదటగా ఉపయోగించబోం అన్న విధానానికి భారత్ కట్టుబడి ఉందని అన్నారు. అయితే భవిష్యత్తులో ఏం జరుగుతుందనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. భారత్ బాధ్యతాయుత అణ్వస్త్ర శక్తిగా అవతరించడం దేశంలోని ప్రతిపౌరుడు గర్వించదగ్గ విషయమన్నారు. అందుకు ఈ దేశం అటల్‌జీకి ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. 1998లో వాజ్‌పేయీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోనే పోఖ్రాన్‌లో భూగర్భ అణుపరీక్షలు నిర్వహించారని, ఇది అప్పట్లో అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిందని రాజ్‌నాథ్ అన్నారు. పోక్రాన్-2 న్యూక్లియర్ పరీక్షల అనంతరం నో ఫస్ట్ యూజ్ (ఎన్ఎఫ్‌యూ) పాలసీకి భారత్ ఆమోదం తెలిపిందని, కేవలం ఆత్మరక్షణ కోసమే అణ్వాయుధాలన్న సిద్ధాంతాన్ని మార్చే అవకాశాలు ఉన్నట్లు మంత్రి చెప్పారు. ప్రతిదాడి కోసం కూడా అణ్వాయుధం వాడలన్న విధానాన్ని అవలంబించాలన్న ప్రతిపాదన చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

## మోడీతో యెడ్యూరప్ప భేటీ

**కర్నాటక వరదలకు పదివేల కోట్ల అభ్యర్థన**

న్యూఢిల్లీ,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): కర్నాటక ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రధాని మోదీని శుక్రవారం కలిశారు. వరదలతో రాష్ట్రం బాగా దెబ్బతిందని, వెంటనే రాష్ట్రానికి తక్షణం 10,000 కోట్లను సాయంగా కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రధాని... సహాయక చర్యల కోసం వెంటనే నిధులను విడుదల చేస్తామని, అలాగే నష్టాన్ని అంచనా వేయడానికి ఓ కేంద్ర బృందాన్ని కూడా పంపుతామని సీఎంకు హామీ ఇచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో వరదలతో రాష్ట్రం ఏవిధంగా దెబ్బతిందో ప్రధానికి సీఎం సవివరంగా తెలియజేసినట్లు అధికారులు వెల్లడించారు. వరదలతో రాష్ట్ర బాగా దెబ్బతిందని, వెంటనే కేంద్ర సహాయం కింద 10,000 కోట్లను విడుదల చేయాలని తాము ప్రధాని మోదీని కోరినట్లు సీఎం యడియూరప్ప తెలిపారు.

# ఇండియాపై కత్తికట్టిన పాక్

**- భారతీయ సినిమా సీడీల అమ్మకాలపై పాక్ దాడులు**

ఇస్లామాబాద్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇండియాపై పాకిస్థాన్ కత్తికట్టిన కనిపిస్తుంది. భారతీయ సినిమా సీడీల అమ్మకాలపై దాడులు మొదలుపెట్టింది. భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులపై వాణిజ్య ప్రకటనలను టీవీల్లో ప్రసారం చేయకుండా నిషేధం విధించింది. ప్రధాని ప్రత్యేక సలహాదారుగా ఉన్న ఫిర్దోయిస్ ఆషిఖ్ అవాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. భారతీయ వాణిజ్య ప్రకటనలు నిషేధించాం. భారత చలనచిత్రాల సీడీలను స్వాధీనం చేసుకునేందుకు సీడీ దుకాణాలపై దాడులు ప్రారంభించామని అవాన్ తెలిపారు. దేశ రాజధానిలో ఈ దాడులు మొదలుపెట్టామని, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దాడులు విస్తరించనున్నామని చెప్పారు. ఇస్లామాబాద్‌లో జరిపిన తాజా దాడుల్లో ఇండియన్ సినిమాలకు చెందిన సీడీలను పలు దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి భారత్-పాక్ మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. భారతతో దౌత్య, వాణిజ్య సంబంధాలను తెంచుకుంటున్నట్టు ప్రకటించిన పాక్, ఆ వెంటనే థార్, సంజౌతా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను నిలిపివేసింది. భారత చలనచిత్రాలపై నిషేధం విధించింది.

## మరింతగా క్షీణించిన జైట్లీ ఆరోగ్యం

**ఎయిమ్స్‌కు వెళ్లి పరామర్శించిన కోవింద్**

న్యూఢిల్లీ,ఆగస్టు17 (ఆర్ఎన్ఎ): మాజీ కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ ఆరోగ్యం విషమించిందని సమాచారం. ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆయన ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. శ్వాస తీసుకోవడంలో జైట్లీ ఇబ్బంది పడుతున్నారు.

గత 9వ తేదీ నుంచి ఆయనకు ఐసియులో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఎయిమ్స్‌కు చేరుకుని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. గత ప్రభుత్వంలో జైట్లీ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. అరుణ్ జైట్లీ కోలుకోవాలని బిజెపి శ్రేణులు ప్రార్థనలు చేస్తున్నారు. జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి వెంకయ్య తదితర ప్రముఖులు ఆరా తీశారు. జైట్లీ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

# స్తంభాలపై దేవతల చిత్రాలు ఉన్నాయ్

**- అయోధ్య కేసులో సుప్రీంకి తెలిపిన రామలల్లా తరఫు న్యాయవాది**

న్యూఢిల్లీ, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : అయోధ్యకు సంబంధించిన వివాదాస్పద స్థలంలోని స్తంభాలపై పలు దేవతల చిత్రాలు ఉన్నాయని రామలల్లా విరాజ్‌మాన్ తరఫు న్యాయవాది సుప్రీం కోర్టుకు తెలిపారు. వివాదాస్పద రామ జన్మభూమి- బాబ్రీ మసీదు భూ వివాదానికి సంబంధించి ఏడో రోజు విచారణ సుప్రీం కోర్టులో కొనసాగింది. ఈ సందర్భంగా శుక్రవారం రామలల్లా తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌తో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా 1950 ఏప్రిల్ 16నాటి నివేదికను చదివి ధర్మాసనం ముందు వినిపించారు. ఈ వివాదానికి సంబంధించి కోర్టు నియమించిన కమిషనర్ అప్పట్లో ఈ నివేదికను సమర్పించారు. దాని ప్రకారం వివాదాస్పద ప్రాంతంలోని స్తంభాలపై శివుడికి సంబంధించిన పలు చిత్రాలు ఉన్నాయని కోర్టుకు తెలిపారు. అటువంటి చిత్రాలు కేవలం మందిరాల్లో మాత్రమే ఉంటాయని, మసీదుల్లో ఉండవని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటో ఆల్బమ్‌తో పాటు, సంబంధిత నివేదికను కోర్టుకు సమర్పించారు. అయోధ్య భూవివాదానికి సంబంధించిన కేసులో మధ్యవర్తిత్వం విఫలమవ్వడంతో ఈ కేసును సుప్రీం కోర్టు రోజువారీ విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే.

## హామీల అమలు చేయకుండా మోసం

వరంగల్,ఆగస్ట్17(నేటినిజం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ రోజుకో ప్రకటనతో ప్రజలను మభ్యపెడుతున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. బంగారు తెలంగాణ పేరుతో ఇంకెంతకాలం మోసం చేస్తారని అన్నారు. అనేక మందికి జీతాలు రావడం లేదనీ, ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు మంజూరు కావడం లేదనీ, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలతో బంగారు పంటలు పండే భూములు బంజర్లుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ తదితర ప్రాంతాల్లో బలవంతపు భూసేకరణతో రైతులను ముంచుతున్నారని అన్నారు. బంగారు తెలంగాణ అంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పండుగల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. రైతుల బతుకులు ఛిద్రం అవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రిజర్వేషన్ల పేరిట ముస్లింలను, ఎస్టీలను మోసగిస్తున్నారని ఆరోపించారు.

# రాష్ట్రాన్ని అవినీతి మయం చేశారు


**- 70శాతం ప్రజలకు డబ్బులివ్వందే పనులుకావట్లేదు**
**- పరమత సహనంగురించి కేటీఆర్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది**
**- కాళేశ్వరం జాతీయ హోదాపై ఇప్పటివరకు డీపీఆర్ ఇవ్వలేదు**
**- ఆర్టికల్ 370 చేసినట్లుగానే తెలంగాణ విమోచన జరిపితీరుతాం**
**- హైదరాబాద్‌ను యూటీ చేయాలన్న ఆలోచన లేదు**
**- పాత, కొత్తనేతలమంతా కలిసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెస్తాం**
**- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్**

కరీంనగర్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : రాష్ట్రాన్ని అభివృద్ధిచేస్తారని అధికారమిస్తే.. సీఎం కేసీఆర్, తెరాస నేతలు రాష్ట్రాన్ని అవినీతి మయంగా మార్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. శనివారం ఆయన కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా హోటల్ మైత్రిలో మాజీ ఎంపీ వివేక్, ఎంపీ బండి సంజయ్, మాజీ మంత్రి పెద్దిరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతిలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని దేశమంతటా జరిగిన ఓ సర్వేలో తేలిందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ.. కల్వకుంట్ల కుటుంబం పాలైందన్నారు. 70శాతం ప్రజలకు డబ్బులు ముట్టజెప్పందే పని కావడం లేదన్నారు. ప్రాజెక్టుల్లో కమిషన్ల రూపంలో వచ్చిన అవినీతి డబ్బును ఎన్నికల్లో ఉపయోగించారనీ, పేదల సంక్షేమం స్కీంలన్నింటిలోనూ స్కాంలే ఉన్నాయన్నారు. చంద్రబాబును బూచిగా చూపి అధికారంలోకి వచ్చారని లక్ష్మణ్ విమర్శించారు. కరీంనగర్ లో గ్రానైట్, ఇసుక మాఫియా సహజ సంపదను దోచేస్తోందని అన్నారు. రూ.1500 కోట్ల ఆరోగ్య శ్రీ బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు కాబట్టే.. హాస్పిటళ్లలో వైద్య సేవలు నిలిచిపోయాయని లక్ష్మణ్ అన్నారు. సెక్రటేరియట్ కూల్చి రూ.500 కోట్లు ఖర్చు చేస్తామంటున్న ప్రభుత్వానికి పేదల ఆరోగ్యం అక్కర లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో చీకటి రాజ్యం నడుస్తోందన్నారు. సమాచార హక్కును కాలరాసే విధంగా 1457 జీవోలను వెబ్‌సైట్ లో ఉంచడం లేదన్నారు. అధికార టీఆర్ఎస్ భవనాల కోసం ప్రభుత్వ భూములను ఎకరా రూ.100 చొప్పున అప్పనంగా కట్టబెట్టారని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరంపై పూర్తి డీపీఆర్ లేకుండానే రంగుల సినిమా చూపిస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని లక్ష్మణ్ విమర్శించారు. ఎంసెట్, ఇంటర్ పరీక్షల నిర్వహణ తప్పుల తడకగా మారిందన్న లక్ష్మణ్.. 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కేంద్రం నివేదిక అడిగితే సీఎం కేసీఆర్ అది పెద్దకుట్ర అంటున్నారని అన్నారు. గ్లోబరినాపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.62 వేల కోట్లయితే ఒక్క కేసీఆర్ రూ.2 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమ గీతం పాడాల్సి ఉందన్నారు. ఇందుకు బీజేపీ వేదికగా భావించి చాలా మంది పార్టీలో చేరారన్నారు. వివేక్ కు టీఆర్ఎస్ ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నారని గుర్తుచేసిన లక్ష్మణ్ తమ పార్టీలోకి వస్తే.. ఔట్ డేటెడ్ అంటారా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ను సమర్థిస్తేనే తెలంగాణ వాదులు అనడం కరెక్ట్ కాదన్నారు. పరమత సహనం గురించి కేటీఆర్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని లక్ష్మణ్ అన్నారు. మోదీ బొమ్మపెట్టాల్సివస్తోందనే ఆయుస్మాన్ భారత్ అమలు చేయడం లేదన్నారు. ఫసల్ బీమా, ఆవాస్ యోజన లాంటివి తెలంగాణలో అమలు కావడం లేదన్నారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ దినమని, తెలంగాణ విలీన దినాన్ని సీఎం తొక్కిపెడుతున్నారని విమర్శించారు. అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై చర్యలు తప్పవని, ఆర్టికల్ 370రద్దు చేసినట్లుగానే.. తెలంగాణ విమోచన జరిపి తీరుతామని లక్ష్మణ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ ను యూటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోందని, అది ఎంతమాత్రం నిజం కాదని లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ ను యూటీ చేయమని తెలిపారు. బీజేపీలో పాత, కొత్త నేతలమంతా కలిసి పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తెస్తామని, తెలంగాణలో టీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# శబరిమల ప్రధాన పూజారిగా

## ఏకే సుధీర్ నంబూద్రీ



తిరువనంతపురం, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : శబరిమలలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రధాన పూజారి(మేల్‌సంతి)గా ఏకే సుధీర్ నంబూద్రీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఏడాది నవంబర్ 17 నుంచి ఆయన ఆలయ ప్రధాన పూజారిగా ఏడాదిపాటు కొనసాగుతారు. మలప్పురం జిల్లాలోని తిరువయ్య ఆలయంలో ప్రస్తుతం ఏకే సుధీర్ నంబూద్రీ పూజారిగా ఉన్నారు. అయితే ఈయన స్థానంలో ఇదే ఆలయానికి ఎర్నాకుళంకు చెందిన ఎంఎస్ పరమేశ్వరన్ నంబూద్రీ పూజారిగా రానున్నారు. ఆలయంలో శనివారం ఉదయం డ్రా పద్ధతిలో ప్రధాన పూజారి ఎంపిక జరిగింది. స్పెషల్ కమిషనర్ ఎం మనోజ్ పర్యవేక్షణలో ఆలయ పూజారి డ్రా జరిగింది. రాబోయే ప్రధాన పూజారికి ప్రస్తుతం ఉన్న పూజారి ఓ నెల రోజుల పాటు ఆలయ వేడుకలకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. నవంబర్ 16వ తేదీన కొత్త పూజారుల ప్రమాణం జరుగుతున్నది. ఆ మరుసటి రోజే మండల పూజ కోసం శబరిమల ఆలయద్వారాలు తెరుస్తారు.

# పాక్‌కు ఝలక్ ఇచ్చిన అగ్రరాజ్యం

## - 400 మిలియన్ డాలర్ల కోత విధిస్తూ నిర్ణయం

వాషింగ్టన్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : పాకిస్థాన్‌కు అమెరికా మరో ఝలక్ ఇచ్చింది. పాకిస్థాన్‌తో మెరుగైన భాగస్వామ్య ఒప్పందం 2010 కింద ఆ దేశానికి అందజేయాల్సి ఉన్న ఆర్థిక సాయంలో మరింత కోత విధించింది. అమెరికాలో పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పర్యటించిన మూడు వారాల తర్వాత ట్రంప్ ప్రభుత్వం షాక్ ఇవ్వడం విశేషం. ఒప్పందం ప్రకారం ఐదేళ్లలో పాకిస్థాన్‌కు అమెరికా 7.5 బిలియన్ డాలర్లు సాయం చెయాల్సి ఉంది. దీనికి సంబంధించిన కెర్రీ లూగార్ బెర్మాన్ (కేఎల్బీ) చట్టానికి 2010 సెప్టెంబరులో అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. కానీ, పాకిస్థాన్ తన భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, వారికి ఆర్థికంగా వనరులు సమకూర్చుతున్నట్టు ఆధారాలు లభించడంతో ఆ సాయాన్ని అగ్రరాజ్యం సగానికి సగం తగ్గించింది. ఇందులో భాగంగా గతేడాది సెప్టెంబరులో సైనిక సహాయం కోసం అందజేయాల్సిన 300 మిలియన్ డాలర్ల సాయాన్ని అమెరికా నిలిపివేసింది. దీంతో పాకిస్థాన్‌కు అమెరికా చేసే సాయం 4.5 బిలియన్ డాలర్లకు పడిపోయింది. తాజాగా, ఇందులో మరో 400 మిలియన్ డాలర్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అగ్రరాజ్యం నిర్ణయం తో పాక్‌కు అమెరికా చేసే ఆర్థిక సాయం 4.1 బిలియన్ డాలర్లకు తగ్గింది. హక్కానీ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలను అడ్డుకోవడంలో పాక్ విఫలమైందని భావించిన అమెరికా రక్షణ సంస్థ పెంటగాన్ గతేడాది జనవరిలోనే బిలియన్ డాలర్లు సాయం నిలిపివేసింది. ఇటీవల పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అమెరికాలో పర్యటించినప్పుడు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైనప్పుడు ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. పాక్ వైఖరిపై తీవ్రంగా మండిపడిన ట్రంప్, తాము ఏళ్లుగా చేస్తున్న ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏడాదిన్నరలో 1.3 బిలియన్ డాలర్ల సాయాన్ని ఎందుకు నిలిపివేశామో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని ట్రంప్ సూచించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే కశ్మీర్ వ్యవహారంలో అమెరికా నుంచి పాక్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కశ్మీర్‌పై ఐక్యరాజ్య సమితి సమావేశంలో తమకు మద్దతివ్వాలని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఫోన్ ద్వారా సంప్రదించారు. అయితే ఇందుకు నిరాకరించిన ట్రంప్.. ఈ సమస్యను భారత్-పాక్ ద్వైపాక్షికంగా చర్చించుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది.

# మొక్కలు నాటి స్ఫూర్తిని నింపండి

**భావితరాలకు ఆక్సిజన్ అందించాలి**

**హరితహారం సక్సెస్ అవుతోందన్న మంత్రి ఇంద్ర**

ఆదిలాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): ఆలస్యంగా అయినా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ కొనసాగుతుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఇప్పటికే నాటిన వారు వాటిని సంరక్షించాలని, కొత్తగా నాటని వారు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది మన పిల్లలకు అందించే బ్యాంక్ బ్యాలెన్స్ లాంటిదని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న హరితహారంపై శుక్రవారం నాడాయన ఆరా తీసారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి ప్రజలందరూ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా తమ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ఇంటి వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌తో దేశ రాజధాని ఢిల్లీలో నివసిస్తున్న ప్రజలు నెలల తరబడి బయటకు వెళ్లని పరిస్థితులు నెలకొంటాయని రాబోయే కాలంలో రాష్ట్ర ప్రజలకు కూడా అదే పరిస్థితి రావద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అటవీ సంపదను పెంపొందించడంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టిన హరితహారం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఖాళీ స్థలాల్లో తప్పని సరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అవసరమైనన్ని మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఒక వేళ కొరత ఏర్పడితే ప్రత్యేక నిధులను కేటాయించి మొక్కలను కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. హరితహారం కార్యక్రమంలో అధికంగా మొక్క లు నాటి తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలన్నారు. వంద శాతం మొక్కలను నాటి త్వరగా జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకురావాలన్నారు. మహనీయుల పేరిట మొక్కలు నాటించాలన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజులు, స్మారక దినోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, మహనీయుల పేర్లతో మొక్కలు నాటితే విద్యార్థుల జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రాంభించారని అన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పని చేసి విజయవంతం చేయాలని రామన్న అన్నారు. అధికారులు బాధ్యతగా పని చేస్తేనే అది విజయవంతం అవుతుందన్నారు. ప్రభుత్వం కంటి వెలుగు అనే గొప్ప కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కంటి చూపు సమస్యలపై వివరించి వైద్య శిబిరానికి వచ్చేలా చూడాలన్నారు.

# చెత్తకుప్పలో మృత శిశువు స్వాధీనం

హైదరాబాద్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలో ఓ మృత మగ శిశువును పడేసి పోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్ ప్రధాన రహదారి డ్రగ్స్‌కంట్రోల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరిస్తుండగా అక్కడ ఉన్న చెత్తకుండీలో 3నెలల వయసున్న మగ శిశువు కనిపించింది. వెంటనే ఎస్ఆర్‌నగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృత శిశువును పంచనామా నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పార్టీ పటిష్ఠతపై దృష్టి సారించిన సోనియా

## రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల ఎంపికపై కసరత్తు

న్యూఢిల్లీ,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ విభాగాల ప్రక్షాళనకు పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నడుం బిగించారు. ఇటీవలే తాత్కాలిక అధ్యక్షురాలిగా మరోమారు బాధ్యతలు చేపట్టిన సోనియా రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ కొత్త చీఫ్‌ల పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే మహారాష్ట్రకు చెందిన పార్టీ నేతలు శుక్రవారం నాడు సోనియాగాంధీతో సమావేశమయమయారు. రాష్ట్ర విభాగాల ప్రక్షాళనను సోనియా చేపట్టే అవకాశాలున్నట్టు సమావేశానంతరం ఆ పార్టీ నేతలు తెలిపారు. జార్ఖండ్, కర్ణాటక, గోవాలకు పార్టీ కొత్త అధ్యక్షులను సోనియా గాంధీ త్వరలోనే ప్రకటించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. హర్యానాలో అంతర్గత పోరాటాలు ఎక్కువగా ఉండటాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ ఆ వర్గాల మధ్య సద్దుబాట్లకు కొన్ని పరిష్కారాలు సూచించిందని, కర్ణాటక, గోవాల్లో ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు పార్టీని వీడటం పైనా కాంగ్రెస్ అధినాయకత్వం ఆందోళనం వ్యక్తం చేసిందని సమాచారం. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సోనియాగాంధీ, ఈ ఏడాది చివర్లో పలు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నందున పార్టీ సన్నాహాలపై సమీక్షా సమావేశాలు జరుపుతున్నారు. గత బుధవారంనాడు జార్ఖండ్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. హర్యానా, మహారాష్ట్ర ఇన్‌చార్జీలతో కూడా సోనియా త్వరలోనే సమావేశమవుతారని తెలుస్తోంది.

# సీఎం కెసిఆర్ పర్యటనపై మంత్రి సమీక్ష

## పాలమూరు ప్రాజెక్టులపై కలెక్టర్లతో చర్చ

వనపర్తి,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లతో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పర్యటనకు రానున్న నేపథ్యంలో దీనికి సంబంధించి సమీక్షలో చర్చించారు. సమావేశంలో కలెక్టర్లు శ్వేతా మహంతి, రొనాల్డ్ రోస్, శ్రీధర్, కొల్లపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ... సాగునీరు అందించి కరువును పారదోలేందుకే ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నాం. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్ట వనులు వేగవంతం చేసేందుకే సీఎం కేసీఆర్ పర్యటిస్తున్నారని అన్నారు. ఏ ప్రాంతంలో పర్యటిస్తే బాగుంటుందనే అంశాలపై సమావేశంలో చర్చించాం. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగూణంగా ఉండేందుకు పర్యటనపై కసరత్తు చేస్తున్నామన్నారు. పాలమూరు ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు సిఎం కెసిఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు.

# ఆరోగ్యశ్రీపై మంత్రి ఈటెల చర్చలు

## సానుకూలతను వ్యక్తం చేసిన నెట్ వర్క్ ఆస్పత్రులు

హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఆరోగ్యశ్రీ సేవల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్య సేవలు నిలిపి వేయడంతో రంగంలోకి దిగిన ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ వారితో చేసిన చర్చలు ఫలించాయి. జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భవన్‌లో నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చర్చలు జరిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆస్పత్రుల ప్రతినిధులు ఈటలను కోరారు. అలాగే ఆరోగ్యశ్రీ బిల్లులను గ్రీన్‌ఛానెల్‌లో చేర్చాలని, 2007లో చేసిన ఆరోగ్యశ్రీ ఎంవోయూను ఇప్పటి పరిస్థితులకు తగినట్లుగా సవరించాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనలను మంత్రికి ప్రతినిధులు అందజేశారు. దీంతో పాటు ఆరోగ్యశ్రీ కింద చేసే శస్త్రచికిత్సలు, ఔషధాలకు చెల్లింపులను పెంచాలని డిమాండ్ చేశారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న రూ.1500కోట్లలో రూ.500 కోట్ల వరకు విడుదల చేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# 18న బిజెపిలో భారీగా చేరికలు

**ముఖ్య అతిథిగా వస్తున్న జెపి నడ్డా**

**అక్రమాల గ్లోబరీనాపై ఎందుకు చర్యలు తీసుకోరు**

**కెసిఆర్ సర్కార్‌పై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్**

హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): ఈనెల 18న తెదేపా, తెరాస, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు నేతలు భాజపాలో చేరనున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ఆ సభలోనే వివిధ పార్టీల నేతలు భాజపాలో చేరతారని లక్ష్మణ్ వివరించారు. రాష్ట్రంలో తెరాసను గద్దె దించే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో తమతో భాగస్వామ్యమయ్యేందుకు కలిసే వచ్చే నేతలను స్వాగతిస్తామని లక్మణ్‌తో వివరించారు. ఈ సందర్భంగా నాంపల్లి గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్సీ రాంచందర్ రావు, ఎంపి గరికపాటి తదితరులు ఉన్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి జేపీ నడ్డా సమక్షంలో బీజేపీలో భారీగా చేరికలు ఉంటాయని ఎంపీ గరికపాటి మోహన రావు అన్నారు. ఉమ్మడి 10 జిల్లాల నుంచి టీడీపీ నేతలు బీజేపీలో చేరనున్నారని, తెలంగాణలో టీడీపీకి భవిష్యత్ లేదన్నారు. తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు బీజేపీ దశ దిశ చూపబోతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణకు బీజేపీ అవసరమని గరికపాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ ఒకరు త్వరలో బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు రాష్ట్ర బీజేపీ వర్గాలు వెల్లడించాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. ఈనెల 18న బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆయన బీజేపీ కండువా వేసుకోనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇ÷-లలెందు మాజీ ఎమ్మెల్యే వూకె అబ్బయ్య కూడా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 18న బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఇదిలావుంటే కనీస అర్హత లేని గ్లోబరీనా సంస్థకు ఇంటర్ ఫలితాల అప్పగింత టెండర్ అప్పగించి తెరాస ప్రభుత్వం కుట్రకు పాల్పడిందంటూ లక్ష్మణ్ ఆరోపించారు. తప్పులు దొర్లాయని స్పష్టంగా తెలిసినప్పటికీ సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ మేరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదంటూ మండిపడ్డారు. గ్లోబరీనా సంస్థ వైఫల్యం వల్లే ఇంటర్మీడియట్ ఫలితాల్లో తప్పులు దొర్లాయని త్రిసభ్య కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత కూడా ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఇలా వాస్తవాలను వక్రీకరిస్తూ తెరాస పాలన సాగిస్తుందంటూ ఆయన విమర్శించారు.

# తెలంగాణ వ్యాప్తంగా చేపపిల్లల పెంపకం

**మత్స్యకారులకు అండగా ప్రభుత్వం సాయం**

**వెల్లడించిన మంత్రి తలసాని**

కాళేశ్వరం,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం శుక్రవరాం ప్రారంభమైంది. వందశాతం పూర్తి రాయితీపై తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని కోయిల్ సాగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేపపిల్లలను వదిలిపెట్టి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వర్ణ ప్రాజెక్టులో మరో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. 15 రోజుల్లోగా చేపపిల్లల వంపిణీ వక్రియను పూర్తి చేస్తామన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వంఅండగా ఉందని మంతంరి తలసాని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉచితంగా చేపపిల్లలను అందేస్తోందన్నారు. సంఘాల వారు ఎవరికో అప్పగించకుండా వీటిని సాకి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇటీవల కురిసిన జోరు వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. నీటి వనరుల్లో చేపపిల్లల విడుదలకు ఇదే మంచి సమయమని ప్రభుత్వం భావించింది. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ చేపడుతోంది. ఈ ఏడాది 24,953 నీటివనరుల్లో రూ.52కోట్ల విలువైన చేపపిలలను వదలాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 80.86 కోట్ల చేపపిల్లలు, 5 కోట్ల రొయ్య పిల్లలను నీటి వనరుల్లో వేయాలని నిర్ణయించింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ నగర శివార్లలోని మడికొండ పెదచెరువు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పెదపెండ్యాల చెరువులో చేపపిల్లలను వదిలారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన మత్స్య, పాడి, ఉద్యాన, రంగాల ద్వారా రైతులకు, ఆయా కులాల వారికి లబ్ది చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తునదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మత్స్యకారులు దళారుల బారినపడకుండా రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు. ఈ సంవత్సరం ఒక్క వనపర్తి జిల్లాలోనే 252 కోట్ల చేపపిల్లలను రిజర్వాయర్లలో వదులుతున్నట్లు వెల్లడించారు. దీనివల్ల మత్స్యకార కుటుంబాల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. మత్స్యకారుల కష్టం వారికే దక్కాలన్నా ఉద్దేశంతో మధ్య దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం చేప విత్తనాలు మొదలుకొని చేపలు పట్టడం, మార్కెటింగ్ వరకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ముఖ్యంగా, సబ్సిడీపై చేప పిల్లల విత్తనాల వంపిణీ, వలలు, వాహనాలు మినీ మార్కెట్, సదుపాయాలు వంటివి కనిపిస్తున్నదని, మత్స్యకార కుటుంబాలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

**ప్రమాదంలో ఇద్దరు వ్యక్తుల మృతి**

నల్లగొండ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): జిల్లాలో జరగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వేములపల్లి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన మల్లంపాటి వీరాంజనేయులు(60), గూడెపూరి శ్రీనివాస్(50) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై నల్గొండవైపు వెళ్తున్నారు. మండల కేంద్రంలోని మమత హోటల్ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వీరాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా అతడు మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోవడంతో అప్రమత్తమైన పోలీసులు సమాచారాన్ని మాడుగులపల్లి మండలకేంద్రంలోని టోల్‌గేట్ సిబ్బందికి అప్పగించారు. దీంతో పోలీసులు ప్రమాదానికి కారణమైన వారిని టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఘటనాస్థలాన్ని సీఐ రమేశ్‌కుమార్ పరిశీలించారు. పట్టుబడిన వాహనాన్ని వేములపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించి కారు యజమాని గిరిధర్, డ్రైవర్ ఉదయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుధీర్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదం సంభవించింది. గుర్తు తెలియని వాహనం ఢీకొని అందె భీరావు(28) అనే యువకుడు మృతిచెం దాడు. మృతుడి స్వస్థలం వాంకిడి మండలం దుబ్బగూడగా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

# భారత చీఫ్ కోచ్‌గా తిరిగి నియామకం

ముంబై: టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి తిరిగి ఎంపికయ్యాడు. కోచ్ పదవి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆరుగురిని ఇంటర్వ్యూకు పిలిచిన కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ) చివరికి రవిశంకర్ జయద్రిత శాస్త్రి వైపే మొగ్గుచూపింది. 2021 ఐసీసీ వరల్డ్ టీ20 వరకు రెండేండ్ల పాటు అతడు ఈ పదవిలో కొనసాగనున్నాడు. బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ ఫిల్ సిమ్మన్స్ వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాకపోగా.. మిగిలిన ఐదుగురి ప్రణాళికలను క్షుణ్ణంగా పరిశీలించిన సీఏసీ చివరకు రవిశాస్త్రికే పట్టం కట్టింది. అనుభవం, గతంలో సాధించిన ఘనతలు, కోచింగ్ నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, ఆధునిక సాధనాల పరిజ్ఞానం అనే ఐదు అంశాల ఆధారంగా ఈ ఎంపిక చేపట్టినట్లు కమిటీ సభ్యులు శాంతా రంగస్వామి, అన్షుమన్ గైక్వాడ్ స్పష్టం చేశారు. ప్రతి అంశానికి నాలుగు గ్రేడ్‌లు (వెరీగుడ్ 20, గుడ్-15, యావరేజ్-10, పూర్-5)గా మార్కులు కేటాయిస్తూ.. చివరకు వాటన్నింటిని కలిపి అగ్రస్థానంలో నిలిచిన వారిని అత్యంత పారదర్శక పద్ధతిలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కోచ్ స్థానం కోసం నిర్వహించిన ఈ రేసులో తీవ్ర పోటీ నడిచింది. మూడో స్థానంలో టామ్ మూడి, రెండో స్థానంలో మైక్ హెస్సన్ నిలువగా.. శాస్త్రికే టాప్ ప్లేస్ దక్కింది. వారి మధ్య ఎంత తేడా ఉందో చెప్పను కానీ పోటీ మాత్రం చాలా రసవత్తరంగా సాగి స్వల్ప అంతరంతో.. అంతా ఊహించినట్లు మరోసారి రవి కోచ్‌గా ఎంపికయ్యాడుఅని ఇంటర్వ్యూ అనంతరం కపిల్ స్పష్టం చేశాడు. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ వచ్చే వారం సహాయక బృందాన్ని ఎంపిక చేయనుంది.

నాలుగోసారి..

టీమ్‌ఇండియా కోసం పనిచేయడం శాస్త్రికి ఇది నాలుగోసారి. మొదటిసారి 2007 బంగ్లాదేశ్ పర్యటన సందర్భంగా క్రికెట్ మేనేజర్‌గా వ్యవహరించిన అతడు 2014 నుంచి 2016 వరకు టీమ్ డైరెక్టర్‌గా కొనసాగాడు. ఆ తర్వాత ఏడాది పాటు కుంబ్లే కోచ్ బాధ్యతలు చేపట్టగా.. అనంతరం 2017లో హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. అయితే వన్డే ప్రపంచకప్‌తోనే శిక్షణ బృందం గడువు ముగిసినా.. కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియ కోసం బీసీసీఐ 45 రోజుల పాటు పొడిగింపు ఇచ్చింది. ఈ క్రమంలో కొత్త కోచ్ కోసం దరఖాస్తులు స్వీకరించిన బోర్డు అందులో అత్యుత్తమమైన ఆరుగురిని ఇంటర్వ్యూకు పిలిచింది. వీరిలో ఫిల్ సిమ్మన్స్ చివరి క్షణంలో పోటీ నుంచి తప్పుకోగా.. మైక్ హెస్సన్, రాబిన్‌సింగ్, లాల్‌చంద్ రాజ్‌పుత్ నేరుగా ఇంటర్వ్యూకు హాజరై తమ ప్రణాళికలను సీఏసీ ముందుంచగా.. శాస్త్రి, టామ్ మూడి స్కైప్ ద్వారా అందుబాటులోకి వచ్చారు.

మెరుగైన రికార్డే ముందు నిలబెట్టింది..

వెస్టిండీస్ టూర్‌కు బయలుదేరే ముందు కెప్టెన్ కోహ్లీ బహిరంగంగానే రవిశాస్త్రి కోచ్‌గా ఉంటే బాగుంటుందని చెప్పినా.. అతడి అనుభవం, రికార్డులు, గణాంకాలు కూడా ఎంపికలో ప్రధాన పాత్ర పోషించినట్లు కనిపిస్తున్నాయి. 57 ఏండ్ల రవిశాస్త్రి భారత్ తరఫున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడాడు. చాంపియన్స్ ట్రోఫీ(2017) అనంతరం కుంబ్లే తప్పుకోవడంతో కోచ్‌గా ఎంపికైన శాస్త్రి.. చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన గత రెండేండ్లలో భారత్ టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంకులో నిలిచింది. దీంతో పాటు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ చేజిక్కించుకోవడం.. 71 ఏండ్లలో తొలిసారి ఆసీస్‌లో ఆసీస్‌పై టెస్టు సిరీస్ నెగ్గడం వంటి ఘనతలు ఖాతాలో వేసుకుంది. శాస్త్రి శిక్షణ కాలంలో 21 టెస్టుల్లో13.. 60 వన్డేల్లో 43.. 36 టీ20ల్లో 25 విజయాలు సొంతం చేసుకుంది. వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమిని పెద్దదిగా చేసి చూడకుండా ఓవరాల్ జట్టు ప్రదర్శనపై దృష్టి పెడితే శాస్త్రి కోచ్‌గా సఫలమయ్యాడనే గణాంకాలు చెప్తున్నాయి. ఇదే అభిప్రాయానికి వచ్చిన సీఏసీ మరోసారి అతడినే కోచ్‌గా ఎంపిక చేసింది. దీంతో ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి కోచ్‌గా వ్యవహరించిన రాబిన్‌సింగ్‌తో పాటు, ఆఫ్ఘనిస్థాన్, జింబాబ్వే జట్లకు కోచ్‌గా పనిచేసిన రాజ్‌పుత్‌కు మొండిచేయి ఎదురైంది. ముఖ్యంగా శిక్షణ బృందంలో ఏదో ఓ స్థానంలోనైనా భారత్‌కు సేవలందించాలనుకున్న లాల్‌చంద్ ఆశలు అడియాశలయ్యాయి.



ఈ అంశంపై సీఏసీ నన్ను సంప్రదించలేదు.

## క్రీడలు

నా అభిప్రాయాన్ని కోరలేదు. కానీ మేమందరం రవి భాయ్‌తో సన్నిహితంగా ఉంటాం.

ఈ నిర్ణయం చాలా సంతోషాన్నిచ్చింది

– విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్.

ఎంపికలో కోహ్లీ ప్రమేయం లేదు

కోచ్ ఎంపికలో ఎవరి జోక్యం లేదు. కోహ్లీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. అతడిని అడగాలనుకుంటే మొత్తం జట్టును అడిగి అభిప్రాయాలు సేకరించేవాళ్లం. కానీ అలాంటిదేమి చేయలేదు. ప్రపంచకప్ నెగ్గనంత మాత్రాన రవిశాస్త్రి ఘనతను తక్కువ చేయలేం. ఓవరాల్‌గా చూసుకుంటే జట్టు ప్రదర్శన బాగుంది. ముఖ్యంగా అతడిచ్చిన ప్రజంటేషన్, జట్టు భవిష్యత్తుపై అతడికున్న దూరదృష్టి కమిటీని ఆకట్టుకుంది. అందులో అతడి ప్రణాళికలేంటో స్పష్టంగా వివరించాడు. అది చూశాక రవిశాస్త్రి కష్టం ఏంటో తెలిసింది. దీంతో మేము ఏకీభవించాం. అదీకాక ప్రస్తుత కోచ్ కావడంతో కుర్రాళ్ల గురించి అతడికి బాగా తెలుసుంటుంది. వారికి కూడా శాస్త్రిపై ఓ అవగాహన ఏర్పడి ఉంటుంది.

# ఖేల్రత్నకు బజరంగ్ పూనియా



న్యూఢిల్లీ: గత కొన్నేండ్లుగా ఊరిస్తూ వస్తున్న దేశ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్రత్న ఈసారి స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాకు దక్కే అవకాశముంది. ఇప్పటి వరకు ఈ అవార్డుకు బజరంగ్ ఒక్కడి పేరే ప్రతిపాదనకు రావడంతో పాటు రేసులో మరో ప్రధాన పోటీదారు లేకపోవడంతో దాదాపుగా అతడికే అవార్డు దక్కే చాన్స్ ఉంది. క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ, విశేష సేవలు అందించిన వారికి ప్రతీ ఏడాది ఈ అవార్డు అందిస్తారు. ఇందులో భాగంగా గత కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్నా.. అనివార్య కారణాల వల్ల బజరంగ్ (65 కేజీలు)కు ఈ పురస్కారం దక్కలేదు. 12 మందితో కూడిన సెలక్షన్ కమిటీ శుక్రవారం బజరంగ్ పేరును అత్యున్నత పురస్కారానికి నామినేట్ చేసింది. రిటైర్డ్ జస్టిస్ ముకుందకమ్ శర్మ నేతృత్వంలోని ఈ కమిటీలో భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా, స్టార్ బాక్సర్ మేరీ కోమ్ కూడా ఉన్నారు. బజరంగ్ పేరును ఖేల్రత్న అవార్డుకు సిఫార్సు చేశాం. అతడి ఎంపిక ఏకగ్రీవం కావడం ఖాయమేఅని ఓ అధికారి తెలిపారు. దీంతో పాటు వివిధ క్రీడారంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అర్జున, గురువులకు ద్రోణాచార్య అవార్డులను బహుకరించనున్నారు.

గతేడాది చుక్కెదురు

జకార్తా(2018) ఆసియా క్రీడలతో పాటు గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణాలు సాధించిన బజరంగ్ గతేడాది సూపర్ ఫామ్ కనబర్చి ఖేల్రత్నకు ప్రధాన పోటీదారుగా కనిపించాడు. అయితే పూనియాను కాదని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానుకు ఈ పురస్కారం అందించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన బజరంగ్ ఈ అంశంపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. తర్వాత సీనియర్లు నచ్చజెప్పడంతో వెనక్కితగ్గాడు. ఇప్పటి వరకు ముగ్గురు రెజ్లర్లకు ఈ పురస్కారం దక్కగా బజరంగ్ నాలుగో వాడు కానున్నాడు. గతంలో సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, సాక్షి మాలిక్‌కు ఖేల్రత్న అవార్డు లభించింది. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం (ఆగస్టు 29, జాతీయ క్రీడాదినోత్సవం) సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో ఈ పురస్కారాలు అందజేయనున్నారు. అవా ర్డు కింద పతకంతో పాటు సర్టిఫికెట్, రూ.7.5 లక్షల నగదు ఇస్తారు. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ల్లో ఇప్పటివరకు రెండు పతకాలు నెగ్గిన బజరంగ్.. టోక్యో ఒలింపిక్స్ (2020)లో భారత పతక ఆశలు మోయనున్నాడు.



విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ నివసించిన శ్యామోలి ఇంటిని పూర్తిగా ఆధునీకరించి జాతికి అంకితం చేసిన సందర్భంగా శాంతినికేతన్‌లో జరిగిన కార్యక్రమాన్నిజ్యోతి వెలిగించి ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# జమ్ముకాశ్మీర్ భారత్ అంతర్భాగం

### రాజకీయ విభేదాలు పక్కన పెట్టి ముందుకు సాగాలి
### జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి
### విశ్వభారతి కార్యక్రమంలో వెంకయ్యనాయుడు

కోల్‌కతా,ఆగస్ట్17 (ఆర్ ఎన్ఎ): జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఎప్పటికీ అలాగే ఉంటుందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మరోమారునొక్కి చెప్పారు. భారత్‌లో అంతర్భాగంగా ఉన్నకాశ్మీర్‌ను ఎవరూ విడదీయలేరని అన్నారు. దేశ భద్రత విషయంలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం లభించి 72 సంవత్సరాలు పూర్తయ్యింది. ఇప్పుడైనా మనం ఆలోచించాలి. జనాభాపరంగా అతి పెద్దదేశమే, కానీ కానీ మనకు భూములు సరిగ్గాలేవు. ఇంత పెద్ద దేశం ఇంకా దిగుమతి చేసుకున్న ఆహార పదార్థాలపై ఆధారపడడం సరికాదు. స్వదేశీ ఆహార పరిజ్ఞానంపై ఆధారపడాలి. అలాగే జనాభాను కూడా నియంత్రించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. స్వాతంత్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ తన ప్రసంగంలో జనాభా విస్ఫోటకంపై ఆందోళన వ్యక్తం చేసిన తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొనే వెంకయ్యనాయుడు పై వ్యాఖ్యలు చేశారు. మరోవైపు సంస్కరణలు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ హయాంలోనే ప్రారంభమయ్యాయని, అప్పుడే విశ్వవ్యాప్తంగా భారత్‌ను అమితంగా గౌరవించేవారని తెలిపారు. ఆయన పాలనలో ప్రభుత్వంలో ఓ పద్ధతి ప్రకారం మార్పులు తెచ్చారని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచారని వెంకయ్యనాయుడు తెలిపారు.

# పెన్షన్ లేకుండా ఆర్మీ అధికారికి ఉద్వాసన

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ మేజర్ జనరల్‌కు ఇండియన్ ఆర్మీ భారీ శిక్షను ఖరారు చేసింది.

అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఆ మేజర్‌ను ఉద్యోగ విధుల నుంచి డిస్మిస్ చేశారు. పెన్షన్ లేకుండానే అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిసింది. సైనిక కోర్టులో జరిగిన విచారణకు సంబంధించిన అంశాన్ని ఇవాళ ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ తెలిపారు.

ఈ కేసులో గత జూలైలోనే నిర్ణయం వెలుబడినట్లు తేలింది. 2016లో చాందీమందిర్‌లో లైంగిక వేధింపుల ఘటన జరిగింది. కెప్టెన్ ర్యాంక్ ఉన్న ఓ మహిళా ఆఫీసర్‌ను మేజర్ వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# సాధారణ స్థితికి కాశ్మీర్ పరిస్థితులు

### తెరుచుకోనున్న స్కూళ్లు

శ్రీనగర్,ఆగస్ట్17 (ఆంఎన్ఎ): కాశ్మీర్‌లో పరిస్థితులు మామూలు స్థాయికి చేరుకుంటున్నాయి. పంద్రాగస్ట్ వేడుకలు కూడా సాఫీగా సాగాయి. జమ్మూకశ్మీర్‌లో సోమవారం నుంచి స్కూళ్లు, ప్రభుత్వ ఆఫీసులు తెరుచు కోనున్నాయి. గత 12 రోజులుగా కశ్మీర్‌లో ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ఆర్టికల్ 370 రద్దుతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కశ్మీర్‌లో విధించిన ఆంక్షలను త్వరలోనే ఎత్తివేయ నున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవరాం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రతి రోజు భద్రతను సమీక్షి స్తున్నామని, ఏజెన్సీలను సుప్రీం విశ్వసించాలని కేంద్రం వెల్లడించింది. జమ్మూలో ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేశారు. కానీ శ్రీనగర్‌లో మాత్రం ఇంకా ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఇంటర్నెట్‌పై మాత్రం ఇంకా కొన్ని రోజుల పాటు ఆంక్షలు కొనసాగించనున్నారు. ఇదిలావుంటే జమ్మూ కశ్మీర్ సాధారణ స్థితికి వచ్చేసిందని సీఎస్ వీబీఆర్ సుబ్రమణ్యం చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ యథావిధిగా పనిచేస్తున్నా యని తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలు, విద్యాసంస్థలు తెరచుకుంటాయని ఆయన పేర్కొన్నారు. మిగతా ఆంక్షలను సైతం దశలవారీగా తొలగిస్తామన్నారు. కశ్మీర్ భద్రతకు ఢోకాలేదని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది.

# మున్సిపల్ ఎన్నికలపై 600పైగా అభ్యంతరాలు

### వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారన్న హైకోర్టు

హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టులో విచారణ శుక్రవారం కూడా జరిగింది. మున్సిపల్ ఎన్నికల వ్యవహారంలో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన ధర్మాసనం.. కౌంటర్‌లో పొందుర్చిన అంశాల్లో వాస్తవం లేదని వ్యాఖ్యానించింది. మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటికే 606 అభ్యంతరాలు ఉన్నాయని, వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మున్సిపల్ ఎన్నికలపై ఉన్న సమస్యను పక్కన పెట్టి.. ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించింది. ఇదే సమయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. అయితే ఏ ఆర్డినెన్స్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందించిన న్యాయవాది.. పాత ఆర్డినెన్స్ ప్రకారం ఎన్నికలు నిర్వహించి.. కొత్త ఆర్డినెన్స్‌కు సపోర్టు తీసుకుంటామని వివరించారు.

# హరితహారంతోనే మనుగడ

### మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి: ఎమ్మెల్యే

జగిత్యాల,ఆగస్ట్17 (ఆంఎన్ఎ): అడవుల ధ్వంసంతో గ్రామాల్లోకి వచ్చిన కోతులు తిరిగి అడవులకు వెళ్లాలనే, వానలు వాపస్ రావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్ద ఎత్తున హరితహారాన్ని ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమనీ, పచ్చదనం, పరిశుభ్రతను మెరుగు పరిచేందుకు జిల్లాలో చేపట్టిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. మొక్కల పెంపకంలో ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు జిల్లాకేంద్రంలో శ్రీగంధం మొక్కలనూ ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. హరితహారంలో భాగంగా అటవీ శాఖ ద్వారా పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి 286లక్షల మొక్కలను అందుబాటులో ఉంచామన్నారు. మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా సాగిస్తున్నామనీ, ఇప్పటికే కోటి మొక్కలు నాటామని వివరించారు. ఇకపోతే ప్రపంచంలోనే అతి పెద్దదైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమనీ, ఈ ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని స్పష్టం చేశారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకంలో భాగంగా రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తి కావచ్చిందనీ, ఇక వరద కాలువలో 365రోజులూ నీరుంటుందనీ, ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లోనూ ఏటా రెండు పంటలు సాగయ్యే అవకాశం కలుగుతుందని వివరించారు. పెంచిన పింఛన్లు అందిస్తుండడంతో లబ్దిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తున్న దన్నారు. కేసీఆర్ కిట్ గర్భిణులకు వరంలా మారిందని తెలిపారు. ఈ పథకంతో ప్రభుత్వ వైద్యశాల్లో ప్రసవాలు 74శాతానికి పెరిగాయనీ, మాతా శిశు మరణాల రేటును కూడా తగ్గించగలిగామన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా గొర్రెలు, పాడి పశువుల పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు.

# కాళేశ్వరానికి భక్తుల తాకిడి

కాళేశ్వరం,ఆగస్ట్17 (ఆర్ ఎన్ఎ): కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందడి కొనసాగుతోంది.

ప్రతి రోజూ భక్తుల రాకపెరుగుతోంది. ఈ సందర్భంగా స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. కాళేశ్వరం సందర్శనకు వచ్చే వారు సైతం దర్శనానికి వస్తున్నారు.

ఉదయం నుంచే త్రివేణి సంగమం గోదావరి నది పుష్కరఘాట్ తీరంలో భక్తులు స్నానా లు చేసి, నదీమాతల్లికి తర్పణాలు వదిలారు. దీపాలు వెలిగించి, హారతులిచ్చారు. గర్భలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. తులసి చెట్లు వద్ద దీపాలు వెలిగించారు.

# ఏసిబి వలలో ట్యాక్స్ ఉద్యోగులు

హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోదక శాఖకు చిక్కారు. ఎల్బీనగర్ టాక్స్ ఇన్స్‌పెక్టర్ రవిప్రసాద్, బిల్ కలెక్టర్ పోచయ్యలు ఇంటి బిల్లు తక్కువ చేయడానికి రూ.80 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాటు వేసిన ఏసీబీ సిబ్బంది రూ.80వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసిన అధికారులు లంచం ఇవ్వడం, లంచం తీసుకోవడం నేరమని ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సినిమా

# 'ఇండియన్ 2' ఫస్ట్ లుక్ విడుదల



జీనియస్ డైరెక్టర్ శంకర్- లోకనాయకుడు కమల్ హాసన్ కాంబినేషన్‌లో వచ్చిన భారతీయుడు చిత్రం ఎన్ని రికార్డులు తిరగరాసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 22 ఏళ్ళ తర్వాత ఈ మూవీకి సీక్వెల్ చేస్తున్నారు. రూ.180 కోట్ల బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాని ఆగస్ట్ నెలాఖరు నుండి సెట్స్ పైకి తీసుకెళ్ళనున్నట్టు సమాచారం. తెలుగు, తమిళం, హిందీతోపాటు ఇతర భారతీయ భాషల్లోనూ ఈ చిత్రాన్ని ఏక కాలంలో తీయనున్నట్టు టాక్ ఈ చిత్రంలో కమల్‌హాసన్‌కి జోడీగా కాజల్ నటించనున్నారు .దుల్కర్ సల్మాన్ కీలక పాత్రలో, అజయ్ దేవ్‌గణ్ నెగటివ్ పాత్రలో నటిస్తారని సమాచారం . శింబు కూడా ముఖ్య పాత్ర చేయనున్నాడని అంటున్నారు. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో కమల్ లుక్ ఆకట్టుకునేలా ఉంది. 'భారతీయుడు'లో తాను పోషించిన సీబీఐ ఆఫీసర్ పాత్రనే సీక్వెల్‌లోనూ నెడుముడి వేణు పోషించనున్నారు. వెన్నెల కిషోర్ కూడా చిత్రంలో కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తుంది. లైకా ప్రొడక్షన్స్ భారీ బ్జడెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. అనిరుధ్ చిత్రానికి సంగీతం సమకూర్చుతున్నారు.

# 'సైరా' నుండి చిరు పవర్‌ఫుల్ లుక్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి కెరియర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం సైరా నరసింహారెడ్డి. తొలి తెలుగు స్వాతంత్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సురేందర్ రెడ్డి తెరకెక్కిస్తున్నాడు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్ చరణ్ నిర్మిస్తున్నాడు. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతి బాబు వంటి టాప్ స్టార్స్ నటిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా చిత్రం విడుదల కానుందనే టాక్ వినిపిస్తుంది. అత్యంత భారీ బ్జడెట్ తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలతో పాటు డీఐ వర్క్ జరపుకుంటుంది.

చిత్రంలో బ్రిటీష్ అధికారులకు, నరసింహారెడ్డికీ మధ్య జరిగే అతి కీలకమైన ఒప్పందాలకి సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులని అలరిస్తాయని అంటున్నారు. నిన్న చిత్రానికి సంబంధించిన మేకింగ్ వీడియో విడుదల చేసిన టీం తాజాగా చిరుకి సంబంధించిన లుక్ ఒకటి విడుదల చేశారు. ఇందులో చిరు విల్లు

ఎక్కుపెడుతూ వీరావేశంతో కనిపిస్తున్నారు. చిత్ర టీజర్‌ని ఆగస్ట్ 20న విడుదల చేయనున్నారు.

## రష్మికకు కియారా షాక్!

'ఛలో', 'గీతగోవిందం' సినిమాలతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ అయిపోయింది కన్నడ భామ రష్మిక. కన్నడనాట కూడా రష్మికకు మంచి ఫాలోయింగ్ ఉంది. తెలుగులో ప్రస్తుతం అగ్ర కథానాయకుల సరసన నటిస్తున్న రష్మిక.. తమిళంలో కూడా పాగా వేయడానికి ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలో తమిళ స్టార్ హీరో విజయ్ సరసన నటించే అవకాశం రష్మికకు వచ్చింది.విజయ్ 64వ చిత్రంలో రష్మికకు ఛాన్స్ వచ్చింది. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని ఇటీవలె రష్మిక వెల్లడించింది. అయితే ఇప్పుడు ఆ అవకాశం కియారా అడ్వాణీకి వెళ్లినట్టు తెలుస్తోంది. తెలుగుతోపాటు, బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉండడంతో చిత్రబృందం కియారా వైపే మొగ్గు చూపినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో తమిళంలోనూ సత్తా చాటాలనుకున్న రష్మిక ఆశలు ప్రస్తుతానికి నెరవేరేలా లేవు.

## వెబ్‌సిరీస్‌లో సమంత?

టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయిక సమంత. నాగచైతన్యను ప్రేమ వివాహం చేసుకుని అక్కినేని ఇంట కోడలిగా అడుగుపెట్టింది. తాజాగా 'ఓ బేబీ'తో మంచి విజయం అందుకుంది. ఈ చిత్రానికి నందినిరెడ్డి దర్శకత్వం వహించారు. కాగా సమంత వెబ్ సిరీస్‌లో నటించనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. 'ఓ బేబీ' విజయం తర్వాత సమంత ఓ వెబ్ సిరీస్‌లో నటించేందుకు సంతకం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించిన షూటింగ్ చెన్నైలో జరుగుతోందట. అందులో సమంత పాల్గొంటున్నట్లు సమాచారం. ఈ వెబ్ సిరీస్ ఒకేసారి తెలుగు, తమిళం, హిందీ భాషల్లో తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలపై సమంత ఇంత వరకూ స్పందించలేదు. మరి ఇందులో ఏ మాత్రం నిజం ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే.

# అవినీతికోసమే కొత్త పథకాలు

- కొండనాలుకకు మందేస్తే ఉన్ననాలిక ఊడినట్లు ప్రభుత్వం తీరుంది
- హైకోర్టు కేసీఆర్ ప్రభుత్వంపై అక్షింతలు వేస్తుంది
- కొత్త మున్సిపల్ చట్టంపై సీబీఐ ఎంక్వైరీకి సిద్ధంకండి
- మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : కేసీఆర్ అసంబద్ధ పాలనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, అవినీతి కోసమే కొత్త పథకాలు అమలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కేసీఆర్ తెలంగాణ వాడు కాదు కాబట్టే తెలంగాణకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. తెలంగాణా వాడు కాకున్నా తెలంగాణకు మంచి చేస్తే నమస్కరిస్తామని అన్నారు. ఆగస్టు 15నుండి అద్భుత పాలన చేస్తానన్న కేసీఆర్.. గత 5 సంవత్సరాల నుండి ప్రజా కంఠక పాలనఉందని ఒప్పుకుంటున్నారా అని ప్రశ్నించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకోసం ఆరోగ్య శ్రీ పథకం తీసుకొస్తే.. నేడు ఆ పథకం పనిచేయకపోవ డానికి కారణమేంటని పొన్నాల ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు పెండింగ్‌లో ఉన్నాయని, 108 ఉద్యోగులకు జీతాలు లేవని ఇది వాస్తవం కాదా అంటూ సీఎంపై పొన్నాల మండిపడారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఆరు మాసాలు గడిచిన ఇంతవరకు దానిపై ఎలాంటి ఊసు లేదన్నారు. ఫీజు రీఅంబర్స్‌మెంట్ కేసీఆర్ కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు నాటిన చెట్లు కపడకపోతే ఉద్యోగాలు పోతున్నాయని, మరి కేసీఆర్ చేసిన అన్యాయాలపై ప్రజలు ఎలాంటి శిక్ష వేయాలని లక్ష్మయ్య ప్రశ్నించారు. అంగన్‌వాడీలలో మహిళలకు పౌష్టిక ఆహారం, పాలు ఇంతవరకు ఇవ్వడం లేదన్నారు. తొమ్మిది మాసాల నుండి సర్పంచ్‌లకు ఇంతవరకు చెక్ పవర్ ఇవ్వలేదంటూ సీఎం తీరును ఎండగట్టారు.

కేసీఆర్ అవినీతికోసం అనేక కొత్త పథకాలు తీసుకువస్తున్నారని, కొత్త చట్టాలు తీసుకువస్తామని చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడున్నారు. కొత్త మున్సిపల్ చట్టం తెస్తానన్న ఈ కేసీఆర్ ప్రభుత్వ తీరు ఎలా ఉందంటే?కొండనాలుకకు మందేస్తే, ఉన్ననాలుకకు ఊడినట్టు ఉందన్నారు. హైకోర్టు కేసీఆర్ ప్రభుత్వం మీద అక్షింతలు వేస్తుందని, కొత్త మున్సిపల్ చట్టం పైన మీాది తప్పులేకుంటే మీారూ సీబీఐ ఎంక్వైరీ కి సిద్ధం కావాలంటూ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మా రాష్ట్రానికి ఏమీవద్దు.. కేవలం మీా ప్రేమచాలు అని మోడీని అడిగిన కేసీఆర్? తన అవినీతి బయటపడకుండా ఉండేందుకే ఈ ఎత్తులు వేస్తున్నారని పొన్నాల విమర్శించారు.


**BEFORE THE HONBLE COMMISSIONER FOR WORKMENS COMPENSATION ASST. LABOUR COMMISSIONER IV HYDERABAD**
**E.C.NO.34 OF 2017**
**E.C.NO.35 OF 2017**

Between:
**M. Yeshoda Najrabee**
...Petitioners
And
**Mr. Mohd Taufeeq and Others**
..Respondents

To
**Mr. Mohd Taufeeq**
**S/o. Mohd Ismail,**
**Age: Major**
**Occ: Owner of Lorry bearing No.AP 23W 1060,**
**H.No. 2-1-55, Saipur**
**Tandur, R.R.Dist.**
...Respondent No.1

Whereas the above named Petitioners filed compensation petition against you and The New India Assurance Company Ltd. for a sum of Rs. 6,00,000/- for the accident caused by your vehicle Lorry bearing No.AP 23W 1060 on 28-07-2015 at Karankote ps limits. The above case is posted on **19-08-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 3.00 PM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE COURT)

**C. VENU GOPAL REDDY**
**S. VENLAT REDDY**
Advocates.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad.
Cell: 9440431541


భారత్ నిర్ణయంలో..

# ఎలాంటిమార్పు ఉండబోదు

- కశ్మీర్‌పై తీసుకున్న నిర్ణయం పూర్తిగా అంతర్గత అంశం
- ఈవిషయంలో ఎవరి జోక్యం అవసరంలేదు..!
- ఉగ్రవాదానికి స్వస్తిపలికితేనే పాకిస్థాన్‌తో చర్చలుంటాయి
- ఐక్యరాజ్యసమితిలో స్పష్టంచేసిన భారత శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్

న్యూఢిల్లీ, ఆగస్టు17(ఆర్ఎన్ఎ) : ఆర్టికల్ 370 రద్దు విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ స్పష్టం చేశారు. జమ్మూ అండ్ కశ్మీర్‌పై తీసుకున్న నిర్ణయం పూర్తిగా అంతర్గత అంశమని తెలిపారు. ఈ విషయం లో ఎటువంటి బయటి జోక్యం అవసరం లేదని, ఉగ్రవాదానికి స్వస్తి పలికితేనే పాకిస్థాన్‌తో చర్చలుంటాయని తేల్చిచెప్పారు. జమ్మూ కశ్మీర్ ప్రజలకు మంచి పాలన ఇచ్చేందుకే ఆర్టికల్ 370 రద్దుచేశామన్న ఆయన.. ఇప్పటికే జమ్మూ కశ్మీర్, లడ్డాక్‌లో పరిస్థితులను చీఫ్ సెక్రటరీ ప్రకటించారని అన్నారు. దీనిపై సెక్యూరిటీ కౌన్సిల్ కూడా సంతృప్తి వ్యక్తం చేసిందని, కొద్దిరోజులుగా భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను భద్రతా మండలి ప్రశంసించిందన్నారు. జమ్మూకశ్మీర్‌లో క్రమంగా ఆంక్షలు ఎత్తివేస్తామని.. ఇప్పటికే దీనిపై టైంటేబుల్ ప్రకటించిన విషయం తెలిసిందేనని సయ్యద్ అక్బరుద్దీన్ గుర్తుచేశారు. జిహాద్ పేరుతో ఇండియాలో విధ్వంసం సృష్టిస్తామనే ప్రకటనలు ఇటీవలే విన్నామని, విధ్వాంసాలతో సాధించేది ఏమీా ఉండదన్నారు. ఉగ్రవాదానికి ఊతమివ్వడం మానుకోవాలని, పాకిస్థాన్, ఇతర దేశాల తో భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు శాంతియుతంగా సాగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. నేతల రెచ్చగొట్టే మాటలతో ప్రజలు జీహాద్ వైపు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఒక ప్రాంతీయ అంశాన్ని పాక్, చైనా అంతర్జాతీయ సమస్యగా చూపే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. మరోవైపు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కశ్మీర్‌పై అసాధారణ రీతిలో శుక్రవారం రహస్య సంప్రదింపులు జరిపింది.

వేదలకు

# భూములను ఇవ్వాల్సిందే

## 11వ రోజుకు చేరిన ధర్నాలు

నిజామాబాద్,ఆగస్ట్ 17(ఆర్ఎన్ఎ): కందకుర్తి రైతులు తమ భూముల కోసం చేస్తున్న ధర్నా 11వ రోజుకు చేరింది. తమ పట్టాలు ఇచ్చేంత వరకు తమ న్యాయ పోరాటం చేస్తామని వారన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు వారు ధర్నా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే 127 మంది రైతులకు సంబంధించినటువంటి భూముల పట్టాలను వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనివక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు.పేద ముస్లింలు, దళితులు, బీసీల భూములు లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది సరియైన చర్యకాదని ఆరోపించారు. 1954లో ఇనాం పేరిట అప్పట్లో దళితులకు, మైనార్టీలకు, బీసీలకు ప్రభుత్వం భూములు ఇచ్చిందని అయితే వాటికి సంబంధించిన అన్ని కూడా 1994లో పట్టాలు చేసిందని ఆయన అన్నారు. ప్రభుత్వం వివిధ పథకాల పేరిట రైతులకు భూములు పంచేదిపోయి లాక్కునే ప్రయత్నాలు చేస్తుందని, ఇది అందులోనే భాగమని ఆయన అన్నారు.

# మెట్రో రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): ఢిల్లీ మెట్రో రైలు కిందపడి జహంగీర్‌పూరికి చెందిన ఓ వివాహిత(25) ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఆదర్శనగర్ మెట్రో స్టేషన్ వద్ద రైలు వస్తుండగా.. దాని కిందపడి అనిత అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో మెట్రో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అనితకు ధర్మేందర్‌తో 2015లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరిలో ఒకరి వయసు మూడున్నరేండ్లు కాగా, మరొకరి వయసు ఎనిమిది నెలలు. అనిత మృతదేహాన్ని బాబు జగ్జీవన్ రామ్ ఆస్పత్రికి తరలించారు. అనిత మరణంతో మృతురాలి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# దేశానికి ఆదర్శంగా అభివృద్ధి పథకాలు

## -జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): యావత్ దేశంలోనే ఎక్కడా అమలు కాని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు జరగడం రాష్ట్రానికే గర్వ కారణమని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. అభివృద్ధి పథకాల అమలులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందంజలో ఉందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని, ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వితంతు, వృద్దాప్య పింఛన్లు లబ్దిదారులకు సకాలంలో అందించడం జరుగుతోందని అన్నారు. పెంచిన పింఛన్లను నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతున్నాయన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న గొప్ప నిర్ణయాలకు నిదర్శనం అభివృదద్ఇ కార్యక్రమాలని అన్నారు.

అభివృద్ధికి తాను సాయశక్తులా కృషి చేస్తానన్నారు. బంగారు తెలంగాణ ధ్యేయంగా ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ తీనుకుంటున్న నిర్ణయాలను తెలంగాణ ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేనటేవంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు.

# ఓయో అండ్ ఫ్యాబ్ హోటళ్లతో కలిసి ఆతిథ్య రంగ సేవల్లోకి 'ఉడ్‌చలో'



పుణె, ఆగస్టు 17: రక్షణ రంగ ఉద్యోగులకు విమాన యాన సేవలు అందించే పోర్టల్.. అప్‌కర్వ్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్రాండ్ సంస్థ 'ఉడ్‌చలో' ఇటీవల ఓయో, ఫ్యాబ్ హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకున్నది. సైనిక బలగాల్లో విలువైన వినియోగదారులకు ఆతిథ్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు 'ఉడ్‌చలో' సిద్ధమైంది. భారత సైనిక బలగాలు, పారా మిలిటరీ బలగాలు, మాజీ సైనికులు, డిపెండెంట్లకు ఉచితంగా, సౌలభ్యంగా సేవలు అందిస్తున్నది. ఈ సందర్భంగా ఉడ్‌చలో వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ వరుణ్ జైన్ మాట్లాడుతూ 'కొన్ని సంవత్సరాల నుంచి ఎయిర్ లైన్ బిజినెస్‌లో లబ్ధిదాయక ప్రగతి సాధించింది మా కంపెనీ. మా వినియోగదారులకు సౌలభ్యకర అనుభవాలతో వైవిధ్యభరిత సేవలు అందించేందుకు నూతన మార్గాల్లోకి విస్తరిస్తోంది. ఓయో, ఫ్యాబ్ హోటళ్ల భాగస్వామ్యంతో భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో 11,500కి పైగా ఆస్తుల్లోకి విస్తరిస్తోంది' అని తెలిపారు. గుర్‌గ్రామ్ కేంద్రంగా పని చేస్తున్న త్రీ స్టార్స్ ఫ్యాబ్ హోటల్స్ నెట్‌వర్క్ భారతదేశంలోని ముంబై, న్యూఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కోయంబత్తూర్ నగరాలతోపాటు 40కి పైగా నగరాల పరిధిలో సేవలందిస్తున్నది. ఫ్యాబ్స్ హోటల్స్ సెంట్రల్ ఇన్సియేటివ్స్ హెడ్ శుభం త్యాగి మాట్లాడుతూ రక్షణ రంగ సిబ్బందికి సేవలందిస్తున్నందుకు గర్వంగా ఉంది' అని చెప్పారు. దక్షిణాసియాలో అతిపెద్ద, చైనాలో రెండవ, అంతర్జాతీయంగా మూడో స్థానంలో ఉన్న 'ఓయో హోటల్స్ అండ్ హోమ్స్' వివిధ దేశాల్లో 23 వేలకు పైగా హోటళ్లతో సేవలందిస్తున్నది.

# స్థిరమైన రెండో త్రైమాసికం తర్వాత స్థిరమైన స్థితిలోనే ఉన్న లాంక్సెస్

హైదరాబాద్, ఆగస్ట్ 17: పూర్తి సంవత్సరం కోసం మార్గదర్శకాలు నిర్ధారించబడ్డాయి: ఇఃమెఆం ప్రీ ఎక్సెప్షనల్స్ ఇఖీ 1.000 బిలియన్ల 1.050 బిలియన్ల మధ్య ఉండాలని లక్ష్యం కోలోన్ బలహీన ఆర్థిక వ్యవస్థ మరియు భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ, స్థిరమైన రెండో త్రైమాసికాన్ని నమోదు చేయడం ద్వారా స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లాంక్సెస్ స్థిరమైన స్థితిలోనే కొనసాగుతోంది. ఇఃమెఆం ప్రీ ఎక్సెప్షనల్స్ అత్యంత తక్కువగా 1.4 శాతం మాత్రమే క్షీణించి EUR 286 మిలియన్లుగా నమోదైంది. తద్వారా గత ఏడాది త్రైమాసికం EUR 290 మిలియన్లతో పోలిస్తే దాదాపు బలమైన స్థితిలోనే నిలిచింది.

ప్రత్యేకించి ఆటోమోటివ్ నుంచి డిమాండ్ బలహీనంగా ఉండడంతో ఇంజనీరింగ్ మెటీరియల్స్ మరియు స్పెషాలిటీ అడిటీవ్స్ విభాగాల్లో అమ్మకాల పరిమాణాలు క్షీణించాయి.దీనికితోడు, బలహీన క్రోమ్ ఓర్ వ్యాపారంతో సంపాదన సైతం భారంగా మారింది. అయితే, ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రత్యేకించి జ.రా. డాలర్ బలంగా ఉండడంతో కంపెనీ స్థిరమైన పోర్ట్ ఫోలియో మరియు అనుకూలమైన ఎక్చేంజ్-రేట్ లాంటి వాటి మీాద పెద్దగా ప్రతికూల ప్రభావం పడలేదు. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో 15.9 శాతంతో పోలిస్తే, ఇఃమెఆం మార్జిన్ ప్రీ ఎక్సెప్షనల్స్ ఈ ఏడాది 15.8 శాతంగా నమోదయ్యాయి. ఈ స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ 2019 పూర్తి సంవత్సరంలో తన ఇఃమెఆం ప్రీ ఎక్సెప్షనల్స్ ఇఖీ 1.000 బిలియన్లు నుంచి ఇఖీ 1.050 బిలియన్లుగా ఉంటాయని అంచనా వేస్తోంది. గడచిన సంవత్సరంలో, ఇఖీ 1.016 బిలియన్ల సంపాదనను లాంక్సెస్ నమోదు చేసింది. గ్రూప్ అమ్మకాలు 2019 రెండో త్రైమాసికంలో ఇఖీ 1.810 బిలియన్లుగా నమోదయ్యాయి.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.